# మిసిమి

మాస పత్రిక

జూన్ - 2005



రూ.8/-



చిత్రకారుడు : **చిత్తప్రసాద్**



తెలుగు రైతు

# మిసిమి

**"All that we are is the product of what we have thought"**
**is "We are what we think." - Dammapada.**

సంపుటి 16 జూన్ 2005 సంచిక 6

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**

## విషయ సూచిక

అంతరంగపు తాళంచెవి 'పదం' మూలం : ఉమాశంకర్ జోషి
అనువాదం: డా. జె. లక్ష్మిరెడ్డి

మూఢ నమ్మకం - సైన్స్ మూలం : డా. వై. నాయుడమ్మ
అనువాదం : నాగసూరి వేణుగోపాల్

చిత్తప్రసాద్ ఆంతర్యంలో శ్రామిక జీవన సౌందర్యం - డా. దేవరాజు మహారాజు

నేటి వ్యవస్థలో పత్రికా స్వాతంత్ర్యం - వి. ఆర్. బొమ్మారెడ్డి

సోమర్‌సెట్‌మామ్ - అనుభవాలు, అభిప్రాయాలు - బి. వి. రామిరెడ్డి

విడిప్రతి రూ. **8/-** వార్షిక చందా రూ. **100/-** విదేశీయులకు **$ 20**

ముఖచిత్రం **: తెలంగాణ వీరగాథ**

చిత్రకారుడు : **చిత్తప్రసాద్**

Printed & Published by **Bapanna Alapati,** at Kala Jyothi Process Pvt. Ltd.,
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 20. Ph. 27645536
E-mail : misimieditor@rediffmail.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# ఇంటరులో 'తథాగతుని కథ' తొలగింపు

పై శీర్షికతో గత నెల 'మిసిమి' (పుట 145) లో ప్రచురితమైన న్యూస్ ఫ్లాష్‌కు సంబంధించిన నేపథ్యాన్ని నాకు మిత్రుడు, బౌద్ధవేత్త (ఆయన పేరు రాయవద్దని కోరారు) రాసి పంపారు. ఈ నేపథ్యం 'మిసిమి' దగ్గర లేనందున 'వక్రీకరణ'లను ఇవ్వలేకపోయాం. ఇంటర్ పాఠ్యగ్రంథంగా 'తథాగతుని కథ'ను తొలగించడానికి వక్రీకరణలే కారణం. వక్రీకరణలలో ముఖ్యమైన వాటిలో (స్థలాభావం వల్ల) కొన్నింటినే ఇస్తున్నాం.

''తథాగతుని కథనుగాని, ధర్మాన్నిగాని యథాతథంగా అందించే ప్రయత్నం చేయలేదని 'ఆశంస' చదివితే అర్థమవుతుంది. తన 'అంతరంగ స్థలంపై', తన మేధస్సు ఊహించిన విధంగా 'ఆ మహోన్నతుని పాత్రకు ఆహార్యం, అభినయం, అభిభాషణం రూపొందించానని' రచయిత స్పష్టం చేశాడు... సిద్ధార్థుడు వ్రజించడానికి ప్రేరేపించిన నిమిత్తాల వర్ణనతో ప్రారంభమై (పుట 1-9) సుజాత ఇచ్చిన 'తులసి తీర్థంతో మహాపరినిర్యాణం కలిగి', 'సుజాత ఒడిలో ఆయన తల ప్రక్కకు వాలిపోయి', 'సుజాత శ్వాస నిలచి పోవడంతో అంతమయ్యే (పుట 140)''. ''తథాగతుని కథ'' అంతటా రచయిత స్వైర విహారమే గోచరిస్తుంది.

''బౌద్ధ గ్రంథాలన్నీ నాలుగు నిమిత్తాలను పేర్కొంటే ఈ రచయిత 'సన్యాసిని' వదిలివేసి మిగిలిన మూడు నిమిత్తాలను - రోగి, వృద్ధుడు, శవం - అభూతకల్పనలతో హృదయ విదారకంగా వర్ణించడంతో తృప్తి చెందక, ఆ నిమిత్తాలతో కలత చెందిన సిద్ధార్థుడు ''ఎన్నో ఏండ్లు ముందుకు ఊహించుకొని (పుట 9) వాటిని రాహులునికి ఆరోపించుకొని... భయంకర భవిష్యత్తుని ఊహించుకొని (పుట 11)... పుత్రునిమీద వాత్సల్యంతో ముడిపెట్టి... సిద్ధార్థుని సార్వజనీనతను స్వార్థపరత్వంగా రూపొందించాడు.

''కఠోర తపస్సుతో... సొమ్మసిల్లిపోయినప్పుడు నాగదేవత ఆరాధనకు వచ్చిన సుజాత తెచ్చిన పాయసం సిద్ధార్థుని కివ్వడంతో ఆయన తేరుకొన్నాడు. ఇటువంటి ప్రసిద్ధఘట్టానికి చిలవలు పలవలు కల్పించి సుజాత తన స్థనాలను పిండి పాలను ఆకు దొనెలో సిద్ధార్థుని చేత తాగించడంతో (పుట 14)

''ఇసి పట్టణంలో తొలిసారి బుద్ధుడు ప్రసంగించగా (పుట 22) ఆయన ప్రవచనాలను విన్న అసంఖ్యాక ప్రజానీకం ఆకర్షితులయ్యారు (పుట 22-23). ఆరు సంవత్సరాలు ప్రయత్నించి... ప్రతీత్య ముత్పాదపునశ్చరణ, పరిపుష్టం చేసుకొన్న బుద్ధుడు తన అవగాహనను గ్రహించగలిగిన వారికోసం అన్వేషిస్తూ బయలుదేరి వారణాసి దగ్గర రుషిపట్టణంలోని మృగదావనంలో ప్రప్రథమంగా పంచవర్గీయ భిక్షుయులకు, తన ధర్మముపదేశించాడని, అదే ధర్మచక్ర ప్రవర్తనంగా ప్రసిద్ధి చెందిందని బౌద్ధ సాహిత్యముగ్గడిస్తున్నది.

''బౌద్ధాభిమానులు దీని నంతటిని అపచారంగా భావిస్తే ఆశ్చర్యం లేదు''.

సంపాదకుడు



# అంతరంగపు తాళంచెవి 'పదం'

(1967వ సం॥ జ్ఞానపీఠ్ స్వీకారో పన్యాసంలోని ముఖ్యాంశాలు)

గుజరాతీ నుండి హిందీలోకి అనువదించబడిన ముఖ్యాంశాలకు తెలుగు

అనువాదం: డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి



ఉమాశంకర్ జోషి
(1911-1988)

ఈ కవితలు (నిశీథ్) నా వయసు ఇప్పటి నా వయసులో సగం ఉన్నప్పుడు, బొంబాయి వంటి ఆధునిక మహా నగరంలో మొదట విద్యార్థిగా, ఆ తర్వాత గృహస్థుగా కాలూనటానికి అవసరమైనంత చోటు కోసం శాయ శక్తులా ప్రయత్నిస్తున్నప్పుడు రాసినవి. నాకు బాగా జ్ఞాపకం . నా ఈ సంపుటికి పెట్టిన 'నిశీథ్' పేరుగల కవిత మొదటి పంక్తులు ఒక ఉత్తరంలో ఖాళీగా మిగిలి పోయిన చోటులో రాశాను. ఆ ఉత్తరం నాకు మేఘాని అనే కవి నుండి వచ్చింది. ఆ పంక్తులు నేను లోకల్ ట్రేన్‌లో రాత్రి ఆలస్యంగా ఇంటికి వెళ్తూ రాసినవి. 'అర్ధరాత్రి ఆత్మ'కు నివేదించబడిన ఉద్గీతం ఛందస్సు పైకి వైదిక ప్రార్థనలోని లయతో ఉన్నట్లు కనిపించినా, నిజానికి ఎలెక్ట్రిక్ ట్రేన్ యొక్క నిరంతర 'ఛక్-ఛక్' నడక లయ దీని నిర్మాణంలో కొంత వచ్చి చేరింది. 'ఆత్మ శిథిలాలు' అనే కవితలోని 17సానెట్లలో 13 సానెట్లు నేను ఒక అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థిగా భారతీయ బ్యాంకింగ్ పరీక్షకు చదవడంలో లీనమై ఉన్నప్పుడు మూడు రోజుల్లో రాశాను. ఆ రోజుల్లోనే, ప్రేమ, మృత్యువు, జీవితంలోని ఈ రెండు అనుభవాల గాఢ ప్రభావం నాపై పడింది. ప్రేమ, మృత్యువు, వీటిని వేరు వేరుగా భావించాలా లేక ఒకటిగానే భావించాలా? అనే ప్రశ్న నాలో ఉదయిస్తూ ఉండేది. ఎందుచేతనంటే కవి ఎదుట ఈ రెండూ ఒకే రూపంలో వచ్చి నిలుస్తాయి. సహాయ నిరాకరణోద్యమంలో నాలుగు సంవత్సరాలు పాల్గొన్న తర్వాత మళ్ళీ చదువు కొనసాగించేందుకు అప్పట్లో నేను తిరిగి వచ్చేశాను. స్వచ్ఛందంగా జైళ్ళకు వెళ్ళమని గాంధీజీ ప్రేరేపిస్తూ ఉండినా, బ్రిటిష్ ప్రభుత్వం ఆతిథ్య సౌఖ్యం మా అనుభవంలోకి వచ్చి ఉండినా, యువకులమైన మేము శతాబ్ది మూడవ దశకంలో సోషలిస్టు సిద్ధాంతాలతో ప్రభావితులమై జైలు నుండి బయటకి వచ్చేశాము. అయినప్పటికీ మాపై గాంధీజీ ప్రభావమే అన్నిటికంటే ఎక్కువగా ఉండేది. ఈ జీవనోత్సాహమే మాలో చాలా మందిని ప్రేరేపిస్తూ ఉండడం వల్ల 1930 ఆ ప్రాంతంలో మేము రాయడం ఆరంభించాము.

ఈశాన్య గుజరాత్‌లోని ఒక పల్లెటూరి వాడినైన నేను 'అగ్నిశిఖను పోలిన మొగ్గ' వంటి 'పదం' పట్ల ఎలా మోహితుణ్ణయాను? నాలో నేను ఎన్నోసార్లు ఈ ప్రశ్న వేసుకున్నాను. కాని ఇంత వరకు

---

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి, ఢిల్లీ యూనివర్శిటీలో హిందీ ఆచార్యులు

దానికి సమాధానం దొరకలేదు. కవిగా వికాసం పొందటానికి అధికాధికంగా సామాజిక పరిసరాలతో అతడు అవిభాగుడై ఉండటం అవసరమని నేను పూర్తిగా నమ్ముతాను.

'పదం' (word) పట్ల నా ఆకర్షణకు కారణం నా తల్లిదండ్రులు, పల్లెలో నా చుట్టూ ఉన్నవారు, 'పదం' రుచి తెలిసిన నేర్పరులు కావటమా? నామటుకు నాకు వాళ్ళందరి గురించి అలానే అనిపించేది. ఈ విషయం నాకు బోధపడక ముందే 'పదం' నన్ను మానవ జీవితంలో అభివ్యక్తి పొందడం కోసం తహతహలాడుతూ ఉండే ఎన్నో అంశాల వైపుకు తీసుకు వెళ్ళింది. అందువల్ల వస్తువులతో, ప్రాణులతో నాకు గట్టి పరిచయం ఏర్పడింది. 'పదం' అనే తాళం చెవి సహాయంతో ఈ అన్నింటి అంతరంగాలు నా ముందు తెరుచుకున్నట్లు అనిపించేది. చివరకు ఈ 'పద'మే గతంలో సార్థకమైన దాన్నంతా వర్తమానంలో నాకోసం సజీవంగా మార్చింది. అగోచరమైన భవిష్యత్తు అనే సముద్ర యాత్రా మార్గాన్ని చూపించింది. అంతేకాక నా అంతరంగాన్ని సుసంపన్నం చేసింది కూడా.

కవిత పద నిర్మితం. ఒక కవి ఆత్మలోని లోతైన స్పందనలు సృజనాత్మక పదం ద్వారా పాఠకుల చైతన్యంలో ఆనంద రూపాలుగా మార్పుచెందుతాయి, లేదా స్వయానా పాఠకుని చిదానందాలుగా నిలుస్తాయి.

కవి ఒక తీర్థ యాత్రికుడు. పదం అతనికి మార్గ దర్శకం. అంతే కాదు, అది అంతేకంటే ఎక్కువే. పదం ద్వారానే అతనికి అస్తిత్వం ఏర్పడుతుంది. తర్వాత పదము, కర్మ రెండింటి మధ్య దూరం తగ్గుతూ ఒక బిందువు వద్ద రెండూ కలిసిపోతున్న అనుభూతిని అతడు పొందుతాడు. అప్పుడు పదమే కర్మగా మారుతుంది. ఋగ్వేదంలోని 'కవి- క్రతు' అనే సమాస పదం నాకు బాగా నచ్చుతుంది. వ్యావహారిక దృష్టికి ఆవలిగా చూడగలిగి, అక్కడి స్థితిగతులను గురించి గానం చేసేవాడు కవి. క్రతు అంటే కర్త అనగా క్రియాశీలి అయిన వ్యక్తి. ఈ అర్థంలో కవిక్రతు అంటే గాయన కర్త, అనగా గానం చేయడం ఎవరి పనో, అతడు. గతంలో రవీంద్రనాథ్, నేడు ఆక్టోవియా పాజ్ అలాంటి వాళ్ళు.

నేను నా కళ్ళతో చూచిన అన్నిటికంటే ఆకర్షణీయమైన దృశ్యం - గాంధీజీ ప్రకాశవంతమైన నేత్ర యుగళం. వాటిలో 21 రోజుల ఉపవాసం తర్వాత, వెలసిన అపరిమితమైన ప్రేమ తొణికిసలాడుతూ కనిపించింది. ఇక నేను చూచిన అన్నిటికంటే దారుణమైన, భయంకరమైన దృశ్యం - సిమెంటు, మట్టి ముద్దల లోపల నుండి మెరుస్తున్న ఎముకుల తెలుపు రంగు. ఆ రంగు హిరోషిమాలో అణుబాంబు నరక తాపం వల్ల కరిగి ఆ ముద్దలలో మమేకమై పోయిన ఎముకలది. కావ్యగతాభివ్యక్తి మాత్రమే పరస్పర విరుద్ధాలైన ఈ రెండు అనుభవాలను ఏకతా సూత్రంలో బంధించగలదు.

నా ఉద్బోధన గీతాల వరుస అసంపూర్ణ వ్యక్తిత్వానికి పూర్ణతను కలిగించడంలో సహాయపడే సృజనాత్మక సిద్ధాంతాన్ని చేరుకునేందుకు ప్రయత్నిస్తుంది. నేటి మానవుని పరిస్థితి సృజన శీలి అయిన కళాకారుని నుండి కూడా దీన్నే ఆశిస్తుంది. అతని కళ తన లక్ష్యాన్ని సాధించగలిగినప్పుడు అది సమగ్రమైన, సంపూర్ణమైన జీవితాభిలాషను సార్థకం చేయ కలుగుతుంది. సమకాలీన సమాజంలో ఏర్పడిన యాంత్రిక చక్రం చిన్న చిన్న ప్రేమ ప్రవాహాలను ఇంకిపోయేట్లు చేస్తుంది. జనసమ్మర్దంతో కూడిన

నగరాల్లో మనిషి ఒంటరి తనాన్ని అనుభవిస్తున్నాడు. ఏ శాంతి కేంద్రంలో స్థిరంగా ఉండి మానవుని వలె అతడు వ్యవహరించ గలడో, ఆ అభ్యంతర ఏకాంతం అతనికి దూరమయింది. నేడు మునుపు ఎన్నడూ లేనంతగా కవితా కర్తవ్యం పెరిగి పోయింది. ఆ కర్తవ్యం ఏమిటంటే పడుగు - పేకల్లాగా అల్లుకుపోయిన మానవ సంబంధాలను పరస్పరావలంబన రూపమైన వెలుగులోకి తెచ్చి తన అంతర్దృష్టి, అంతఃప్రేరణల ఆధారంగా మానవునికి, అ-మానవునికి; శరీరానికి, అ-శరీరానికి, జీవితంలోని అపరిహార్యమైన దారుణ నిర్దయకు, సతత ప్రవాహ శీలి అయిన ప్రేమకు మధ్య ఉన్న అపూర్వ సామరస్యం వైపు దృష్టిని ఆకర్షించడం. ఆత్మ పరిశోధన ద్వారా నరకం నుండి స్వర్గానికి వెళ్ళే మార్గాన్ని ప్రపంచానికి చూపించే పని కూడా కవితే చేయాలి.

ప్రస్తుత పరిస్థితుల్లో భారతీయ కవి సమస్త విశ్వానికి సంబంధించిన చింతన, యాతనలలో పాలు పంచుకోకుండా ఉండ లేడు. ఇందులో ఉన్న ఒక అంతర్విరోధమేమిటంటే అతడు ఏ స్థాయి విశ్వ దృష్టి కలిగి ఉంటాడో, అదే స్థాయిలో భారతీయుడై కూడా ఉంటాడు. టాగూరును ఉదాహరణకు తీసుకుంటే ఈ విషయం మనకు అవగాహన అవుతుంది.

మానవ శ్రేయస్సుపై దృష్టి నిలిపే కావ్య రూప నాటకం కవులను తప్పక ఆకర్షిస్తుంది. ఈ రోజు ఏదైనా మహా కావ్యం రచించడం జరిగితే అది కేవలం ఒక జాతికి, లేక ఒక విశిష్ట సంస్కృతికి చెందిన గాథను వర్ణించేదిగా కాక ఏక రూపమైన సమస్త విశ్వం పైన, నేటి సమగ్ర మానవ జాతి పరిస్థితిపైన దృష్టిని కేంద్రీకరించేదిగా ఉండడానికి ఆస్కారం ఎక్కువగా ఉంది. కవితా రచన సాగుతూనే ఉంటుంది. కవితలు నిరంతరం ఏదో సాధించాలనే తపనతో కూడిన దుర్గమ విశాల మరు భూమిలో సేదతీరడానికి ఉపయోగపడే చిరు ద్వీపాలు. ఇందులోనే కవిత చరితార్థత ఉంది.

గర్భస్థ శిశువు నిమీలిత నేత్రాలు
మాతృ ముఖంలో మెరిసే తీరున
చూచావా ఎప్పుడైనా కవిత
నా ఆత్మత్వంలో మెరియడం?

కవి తన కవితను వెనకన పెట్టి నవ్య వస్తువును వెతుకుతూ ఎల్లప్పుడూ ముందుకు సాగి పోతూ ఉంటాడు. ఒక కొత్త, తాజా ఆరంభం కోసం. ప్రతి కవితతో పాటు అతడు కవిగా పునర్జన్మ పొందుతూ ఉంటాడు. ప్రతి కవితా సృష్టితో పాటు అతనికి ఆత్మ పరిపక్వత చేకూరుతూ ఉంటుంది.

**జీవిత విశేషాలు:**

ఉమాశంకర్ జోషికి 1967వ సంవత్సర జ్ఞానపీఠ్ పురస్కారం 'నిశీథ్' అనే ఆయన గుజరాతీ కవితా సంపుటికి ప్రదానం చేయబడింది. ఈ కవితా సంపుటి 1935-1960 మధ్య కాలంలో భారతీయ భాషల్లో వెలువడిన సాహిత్య రచనలలో సర్వ శ్రేష్ఠమైనవిగా ఎంపిక అయిన రెండు గ్రంథాల్లో ఒకటి. రెండవది కన్నడ కవి కు.వెం. పుట్టప్ప రచించిన 'శ్రీరామాయణ దర్శనమ్' అనే మహాకావ్యం. ఈ సంవత్సరం ఈ పురస్కారం వీరిద్దరికి కలిపి ఇవ్వడం జరిగింది.

ఉమాశంకర్ జోషి 1911 జూలై 21న గుజరాత్‌లోని ఈడర్ జిల్లా, బామణా అనే గ్రామంలో జన్మించారు. కొండల నడుమ గలగల ప్రవహించే ఒక చిన్న నది ఒడ్డున ఉన్న ఈ చిన్న గ్రామంలోనే వీరి ప్రారంభిక విద్యాభ్యాసం జరిగింది. అక్కడ భూమి, ఆకాశాలే ఆయన వ్యక్తిత్వాన్ని రూపొందించాయి. ఆయన కావ్య ప్రతిభకు ప్రేరకంగా నిలిచాయి. ఆయన అనేక రచనల్లో - కవితల్లోనే కాదు నాటకాల్లో, కథల్లో, నవలల్లో కూడా - బామణా కొండల ఉనికి మన అనుభవానికి వస్తుంది.

స్కూలు చదువుకు ఆయన ఈడర్ వెళ్ళారు. 1926 వరకు అక్కడ చదివారు. ఒక చోట ఆయన ఇలా రాశారు: ''స్కూలులో ఉండగా నాకు పరమాద్భుతంగా కనిపించిన పుస్తకం బొంబాయిలోని ఒక ప్రకాశకుని పుస్తకాల కేటలాగు. అందమైన పుస్తకాల పేర్లు, వాటి రచయితల పేర్లు నా బాల మనసుకు ఒక గుప్తనిధిగా అగుపించాయి.''

1927లో ఉమాశంకర్ మెట్రికులేషన్ చదివేందుకు అహమదాబాదు వెళ్ళారు. 1930లో కాలేజీ చదువు మానేసి సత్యాగ్రహ సంగ్రామంలో పాల్గొన్నందుకు సబర్మతి జైలు పాలయ్యారు. కొంతకాలం ఒక హైస్కూల్లో ఉపాధ్యాయుడుగా పనిచేసి, ఆ తర్వాత 1938లో ఎమ్. ఏ. పూర్తిచేసి సిడన్‌హమ్ కాలేజీలో ఉపన్యాసకులుగా చేరారు.

1936లో 'గంగోత్తరీ' అనే రచనకు సర్వోచ్చ గుజరాతీ సాహిత్య పురస్కారం 'రంజీత్ రామ్ సువర్ణ చంద్రక్ పురస్కారం' ఈయనకు లభించింది. 1937లో జ్యోత్స్నబేన్‌తో వీరి వివాహం జరిగింది. జ్ఞానపీఠ్ పురస్కారం పొందిన కవితా సంపుటి 'నిశీథ్' 1939లో వెలవడింది. ఇది ఈయన మూడవ కవితా సంపుటి.

'నిశీథ్'లో మొత్తం 116 కవితలు ఉన్నాయి. ఇది గుజరాతీ సాహిత్యంలో అంతకు మునుపు మూడు దశాబ్దాలలో వచ్చిన గీతి కావ్యాల్లో సర్వోత్తమైనదిగా ఎంచబడింది. ఛందస్సు, శైలి, శిల్పము, ప్రక్రియ, వస్తువు, అన్నింటిలో గొప్ప వైవిధ్యం ఈ కవితల్లో మనకు కనిపిస్తుంది. ఈ వైవిధ్యం కవి మనసు విస్తారాన్ని, అతని భావాల లోతును తెలుపుతుంది. సంస్కృతంలోని క్లాసికల్ ఛందస్సులు మొదలు కొని గుజరాతీలోని అత్యాధునిక ఛందస్సుల వరకు అన్ని ఛందస్సులు ఇందులో సాధికారంగాను, ప్రయోగ కౌశల్యంతోను ప్రయోగింపబడ్డాయి. కవి కథల్ - ఆలాప్ శైలిని ఎంత సరళంగా, సహజంగా ప్రయోగిస్తాడో, వాగ్మిత, అలంకారమయమైన శైలిని కూడా అంతే సరళంగా సహజంగా ప్రయోగిస్తాడు. ఈ కవితలలోని వస్తువైవిధ్యం కూడా గమనించ దగ్గది. ఒకవైపు ఆలంబనం పట్ల పిచ్చి ప్రేమ వ్యక్తమయితే, మరోవైపు అశేష మానవ జాతి భవిష్యత్తు గురించిన ఆలోచన వ్యక్త మయింది.

ఈ కవితలు ఆయన బొంబాయి లాంటి ఆధునిక మహానగర వాతావరణంలో ఉంటున్నప్పుడు రాసినవి. అందుచేత వలసవాదానికి, స్వాతంత్ర్యానికి, నియంతృత్వానికి, ప్రజాస్వామ్యానికి, పెట్టుబడి దారీ విధానానికి, సోషలిజానికి మధ్య ఆరోజుల్లో జరుగుతున్న పోరాటం వల్ల జనించిన, రెండవ

ప్రపంచ యుద్ధంలో జరిగిన మారణహోమానికి నేపథ్యంగా మారిన ప్రపంచ చైతన్యాన్ని ఆవరించిన అన్నిరకాల మానసిక వత్తిళ్ళ, ఉద్వేగాల ప్రభావం సహజంగానే ఈ కవితలపై పడింది. ఉమాశంకర్ జోషి ప్రపంచం ఈ దుస్థితి నుండి బయట పడడానికి మార్గంగా ఆదర్శవాదంపై నమ్మకను, వాస్తవికత గురించిన అవగాహనను సుసంగతమైన విధంగా మేళవించి తన పరికల్పనను మానవ జాతి ముందుంచారు. ఈ పరికల్పన కవిగా జోషికి అద్వితీయ ఘనతను చేకూర్చింది.

ఉమాశంకర్ జోషి ఆదర్శ వాదం 'నిశీథ్' కవితా సంపుటలోని 'నిశీథ్', 'విరాట్ ప్రణయ్' లాంటి కవితల్లో తన చరమ పరిణతిని చేరుకుంది. ఆయన యథార్థ అవగాహన 'ఆత్మనా ఖండేర్' అనే 17 చతుష్పదుల వరుసలో తన పూర్ణతనందుకుంది. ఇందులో కవి, ప్రపంచాన్ని జయించాలనే కోర్కెతో వచ్చి దాని శిథిలాలను చూడవలసివచ్చిన ఒక యువకుని శోక కరుణలతో నిండినగాథ వర్ణించబడింది.

జోషి కావ్య రూప నాటకం రచించడంలోనే కవి తన కృషికి సార్థకత పొందగలడని భావించేవాడు. ఆయన ఎన్నో కావ్యరూప నాటకాలు రాశారు కూడా. అతడు ఒక స్థాయి వయస్సుకు, అతని స్వానుభవాలు ఒక పరిణతికి చేరుకున్న తర్వాత కవికి తన వ్యక్తిగత ఆవేశ- ఉద్రేకాల్లో ఆసక్తి ఉండదని, ఆత్మాశ్రయ పద్ధతిలో వాటిని వ్యక్తీకరించే ప్రవృత్తి కూడా అతనిలో ఉండదని, అప్పుడతడు సహజంగా వ్యక్తిగతం కాని వస్తువు వైపుకు, అంటే కథ, నవల, నాటకంలాంటి వస్తూన్ముఖ అభివ్యక్తి రూపాల వైపుకు మళ్ళుతాడని కూడా ఆయన భావించేవాడు.

జోషి, సృజనాత్మక సాహిత్య రచయితగానే కాక, గొప్ప విమర్శకుడుగా కూడా సుప్రసిద్ధులు. సాహిత్య విమర్శకు సంబంధించిన 8 గ్రంథాలు రచించారు. ఎన్నో సాహిత్య సభలకు, సమావేశాలకు సారథ్యం వహించారు కూడా.

1954లో జోషి, గుజరాత్ విశ్వవిద్యాలయంలో భాష-సాహిత్యం విభాగంలో డైరెక్టరుగాను, అక్కడి సాహిత్య అకాడెమీ కార్య నిర్వహణ వర్గ సభ్యుడుగాను నియమితులయ్యారు. 1955లో భారత ప్రభుత్వ ప్రతినిధి వర్గ సభ్యుడుగా అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, గ్రీస్ మొదలైన దేశాలలో పర్యటించారు. 1966లో గుజరాత్ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ అయారు. ఆ తర్వాత శాంతినికేతన్‌లో విశ్వ భారతి విశ్వవిద్యాలయం ఛాన్సలర్‌గాను, కేంద్ర సాహిత్య అకాడెమీ - ఢిల్లీకి అధ్యక్షులుగాను ఉన్నారు. దేశంలోని ఎన్నో సాహిత్య పురస్కారాలు ఈయనను వరించాయి.

వీరు వెలువరించిన రచనలలో 8 కవితా సంపుటాలు, 4 కథా సంపుటాలు, 2 నాటకాలు, 1 నవల, 2 వ్యాస సంకలనాలు, 8 విమర్శ గ్రంథాలు, 2 పరిశోధన గ్రంథాలు, 2 అనువాదాలు, 3 సంపాదిత రచనలు ఉన్నాయి.

1988 డిశంబరు 20వ తేదీన ఉమాశంకర్ జోషి పరమపదించారు.

# మూఢ నమ్మకం - సైన్స్

మూలం: డా॥ వై. నాయుడమ్మ                                    అనువాదం: నాగసూరి వేణుగోపాల్

మన జీవితాల్ని చీకటి మయం చేస్తున్న అంధ విశ్వాసాల్ని తొలగించడానికీ, సాహసం చేయగల ఉత్తేజాన్ని యివ్వడానికీ, భవిష్యత్తును చూడగల, దిద్దగల మేధస్సును అందుకోవడానికీ - శాస్త్రీయ అవగాహన మనకు చాలా అవసరం.
– డా॥వై. నాయుడమ్మ

డా॥ యలవర్తి నాయుడమ్మ (10-9-1922 - 23-6-1985) సుప్రసిద్ధ శాస్త్రవేత్త. కేవలం సైన్స్ పరిశోధనకే పరిమితం కాకుండా, విజ్ఞాన పుంజం అజ్ఞాన తిమిరాన్నీ, దారిద్ర్యపు తిమింగలాన్ని ఎదుర్కోవడానికి ఉపయోగపడాలని భావించిన ప్రయోగశీలి. గుంటూరు జిల్లాలో జన్మించి, కాశీ విశ్వవిద్యాలయంలో చదువు సాగించి మదరాసులోని చర్మ సాంకేతిక సంస్థలో చేరారు. అక్కడి నుంచి ఇంగ్లాండు, అమెరికా వెళ్లి పరిశోధన చేశారు. ముప్పయ్యారు సం॥ కే ఆ సంస్థ డైరెక్టరయ్యి పరిశోధన, పరిశ్రమ కలిసి సాగేలా ప్రయత్నించారు.

వెనుకబడిన గ్రామాలను ప్రయోగశాలలు, బ్యాంకులు దత్తత తీసుకోవడం అనేది డా॥ నాయుడమ్మగారి ఆలోచన.

నాయుడమ్మగారి వర్ధంతిని పురస్కరించుకుని 1976లో బెంగుళూరు విశ్వవిద్యాలయం ప్రచురించిన "Science, Society and Scientific Attitude" అనే పుస్తకంలో ప్రచురితమైన నాయుడమ్మగారి "Science and Superstition" ఆంగ్ల వ్యాసానికి నాగసూరి వేణుగోపాల్‌గారి తెలుగు అనువాదం ఇస్తున్నాం.

**సంపాదకుడు**

నేడు మాయలు, అద్భుతాలు చేయగలవారు విపరీతమైన ప్రచారాన్ని చేసుకొంటున్నారు. గాలిలోంచి ఉంగరాలు, గడియారాలు సృష్టిస్తున్నామని చెప్పుకొంటున్నారు; భవిష్యత్‌గురించి ముందుగా చెప్పడమే కాకుండా దానిని నిర్దేశించడం కూడా తమ చేతనవుతోందని చెప్పుకొంటున్నారు! విజ్ఞాన శాస్త్రాన్ని అధ్యయనం చేస్తున్న విద్యార్థిగా చెబుతున్నా - ఇవన్నీ అయోమయాన్నీ, గందరగోళాన్నీ కల్గిస్తున్నాయి. వీటిని గురించి పట్టించుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది!

అందుకే నేను మూఢ నమ్మకాల గురించి రాసిన పుస్తకాలు చదవడం మొదలుపెట్టా. ఎన్నో తెలుసా? పదమూడు! అవి చదవగా తెల్సిందేమిటంటే... మూఢనమ్మకాల మీద చాలా పుస్తకాలు వెలువడ్డాయని (అదీ ఆంగ్ల భాషలో). భారత దేశంలోని మూఢనమ్మకాల గురించి కేవలం రెండు పుస్తకాలు మాత్రమే 1976 వరకూ ఆంగ్లంలో లభ్యమవుతున్నాయి. ఎక్కువ చదివిన కొద్దీ మరింత అయోమయమే మిగిలింది. ఇలా చదవడం వల్ల ఏమైనా మంచి జరిగిందా అంటే సందేహమే!

**మూఢ నమ్మకమంటే...**

నిఘంటువులు అనేక రకాలుగా నిర్వచిస్తాయి.

---

నాగసూరి వేణుగోపాల్, ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్, ఆకాశవాణి, విశాఖపట్నం.

అద్భుతాన్ని, అసాధారణాన్ని నమ్మటం; తెలియని దానిని గురించి అసంగతమైన భయం; ఒక ఆచారం; మాయపై తీవ్రమైన గురి; భయం లేదా అజ్ఞానం ఆధారంగా వున్న నమ్మకం; అసంగతమైన మతాచారం; అంధవిశ్వాసం... వగైరా.

ఈ నిర్వచనాలను పరిశీలిస్తే మూఢ నమ్మకమనేది అసంగతమూ, మతపరమైనదీ అని విశదమవుతుంది. మరో సమస్య ఏమిటంటే ఒక వ్యక్తి మతం మరో వ్యక్తికి మూఢ నమ్మకం! మూఢ నమ్మకమనేది భయం, అంధవిశ్వాసం, అసంగతమైన దృష్టి - అనే వాటి ఆధారంగా బ్రతికిపోతోంది.

పరిశీలన, ప్రయోగం, పరిశోధనలపై ఆధారపడి, చక్కగా వర్గీకృతమైన జ్ఞానాన్ని 'విజ్ఞానశాస్త్రం లేదా సైన్స్'గా నిర్వచించవచ్చు.

మరి సైన్స్ పరమార్థం ఏమిటి?

**శాస్త్రీయ పద్ధతి (Scientific method):**

పవిత్రత వల్లగానీ, అధికార హోదావల్లగానీ దేనికీ గుర్తింపు లభించదు. కేవలం ప్రాయోగికమైన పరీక్ష, రుజువుల ఆధారంగానే గుర్తించడం జరుగుతుంది. సైన్స్‌లో తప్పులు సరిదిద్దుకోవడానికి వీలుంది. సైన్స్‌లో సృజనకే కాకుండా వినాశనానికి సైతం వీలుంది. శాస్త్రీయ అభినివేశం (Scientific temperment) అనేది ఒక మనోదృష్టి - అది విశాలమైన, హేతుబద్ధమైన మనోదృష్టి. అది ప్రశ్నించగల, జిజ్ఞాస రేకెత్తించగల మనోదృష్టి. నిన్నటిది కాక రేపటిదైన మనోదృష్టి. మార్పును ఆహ్వానించే దృష్టి!

ఇప్పుడు సైన్స్‌కీ, మూఢ నమ్మకానికీ తేడా బాగా గోచరమవుతోంది. సైన్స్ అనేది అవిచ్ఛిన్నమైన పరిణామశీలం గలది, అభివృద్ధి గలది, తన్నుతాను సరిదిద్దుకోగలది. అంతేకానీ స్థాయివల్లగానీ, అధికారి హోదావల్లగానీ, తెలియని భయం వల్లగానీ మారదు.

**మూఢ నమ్మకాల వర్గీకరణ:**

అన్ని కాలాల్లోను, అన్ని విషయాలకు సంబంధించి అనేక రకాలైన మూఢ నమ్మకాలు ప్రపంచమంతటా కనిపిస్తాయి. మూఢ నమ్మకాలను ఈ విధంగా వర్గీకరించవచ్చు.

అ) మతపరమైనవి; ఆ) సంప్రదాయపరమైనవి; ఇ) వృత్తిపరమైనవి ; ఈ) పూర్తిగా వ్యక్తిగతమైనవి

Eric Maple ఎన్నో రకాల మూఢ నమ్మకాలను చాలా విపులంగా వివరించాడు. ఇల్లు, తోట, పని, ప్రయాణం, విశ్రాంతి, వినోదం, ఆచారాలు, దుస్తులు, పొలం, ప్రజలు, జానపద సాహిత్యం, సంప్రదాయం, మాయలు, యోగులు తదితరాలకు సంబంధించి చాలా చాలా మూఢ నమ్మకాలు వున్నట్లు పేర్కొన్నాడు. అలాగే ఖన్నా రచయితలు భారతదేశంలోని మూఢనమ్మకాలగురించి వ్రాస్తూ - తల్లి, పిల్లలు, గర్భధారణ, ప్రసవం, రోగానికి, మంచి చెడు, నిద్ర, ఆలోచన, ప్రకృతి, సహజ ప్రక్రియలకు సంబంధించి చాలా సంఖ్యలో మూఢ నమ్మకాలున్నాయంటారు. 1976లో

ప్రచురితమయిన పుస్తకంలో బిజల్వాన్ (Bijelwan) హిందూ మూఢ నమ్మకాలు - శకునశాస్త్రం, కన్ను అదరడం, తుమ్మడం మొదలైనవాటి గురించి రాశాడు.

**మూఢనమ్మకమెందుకు?**

''సైకాలజి ఆఫ్ సూపర్‌స్టిషన్'' అనే పుస్తకంలో జహోడా (Jahoda) మనస్తత్వ శాస్త్ర రీత్యా మూఢ నమ్మకాలను వివరించడానికి ప్రయత్నిస్తాడు. Eric Maple మూఢ నమ్మకాలను కారణాలతో వివరిస్తాడు. భారతదేశంలో వున్న 300 మూఢ నమ్మకాలను వివరించడానికి ఖన్నా రచయితలు ప్రయత్నించారు. కారణం తెలియని భయం అనేది మూఢ నమ్మకానికి మూల కారణం. ఆ భయానికి కారణం పుట్టుక, చావు, రోగం, ఆపద, నిస్సహాయత, సందేహం, అనిశ్చితత్వం, ఉద్వేగం ఇలా ఏవైనా కావచ్చు. మనకు తెలియనిది ఏదో శక్తివంతమైనదీ వుందని నమ్మడమూ, ఆ నమ్మిక మానవ స్థైర్యాన్ని, గుండె దిటవును నాశనం చేయడమూ మూఢ నమ్మకానికి ఆధారం, అసహాయతకు ఒక అర్థం లేని కవచం ఈ మూఢ నమ్మకం. ఎప్పుడయితే అవకాశాలు, పరిస్థితులు అనేవాటిని మనిషి, అతడి జ్ఞానమూ శాసించలేకపోతున్నాయో అపుడు మనిషి మూఢ నమ్మకాలలో కూరుకుపోతాడు.

మూఢ నమ్మకం అనేది ఒక ఆలోచనా రీతి. అది పూర్తిగా ఒక మనోవికారం. అది కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో బయల్పడుతుంది. ఉద్వేగపూరితమైన, ఆలోచనా రహితమైన దృష్టి వల్లనే మూఢనమ్మకాలు బాగా పాతుకుపోయాయి. భాష, జానపద కథలు, సంప్రదాయం, మతం - ఇలా అన్నీ కలిసి పెరిగి మెదడు మీద ప్రభావం చూపి మూఢ నమ్మకం ఒక రూపు దిద్దుకోవడానికి తోడ్పడుతున్నాయి.

''అదిగో పులి అంటే ఇదిగో తోక'' అనే రీతిలో వున్న మన సంప్రదాయం, కక్షకట్టిందనే సందేహం కల్గించే రీతిలో వున్న వాతావరణం - అనే రెండింటిమీద మూఢ నమ్మకం బతికిపోతుంది.

మూఢ నమ్మకం అనేది పసితనం నుండి సంక్రమిస్తుందని చెప్పవచ్చు. ఇది బామ్మగారు పోసిన ఉగ్గుపాలతో కలసిపోయింది. అది మన ఆలోచనా పద్ధతిలో కలిసివుంది. తెలియనిదేదో జీవితంమీద దాడిచేస్తోందని, దానినుంచి ఏదో శక్తి రక్షిస్తుందనీ నమ్మటమే మూఢవిశ్వాసం.

అంతేకాకుండా సహజమైన జిజ్ఞాస వల్ల కూడా మూఢ నమ్మకం వ్యాపిస్తోంది. అర్థంకాని ప్రకృతి సంఘటనను గమనించటం, దానిని ఆశ్చర్యంతో పరిశీలించడం, దానిని వివరించడానికి ప్రయత్నించడం, విభిన్నతలో ఏకత్వం చూడడానికి ప్రయత్నించడం - ఈ విధానంలో కూడా మూఢ నమ్మకాలు ఏర్పడడానికి ఆస్కారం వుంది. అసహజమైన అనుభవంలో అర్థం వెదకడానికి ప్రయత్నిస్తాడు మనిషి.

కొన్ని మూఢ నమ్మకాలు విద్యావంతం చేయడానికి, ఉద్దేశితమవుతాయి. ఆరోగ్యం, భద్రత, నిలకడల గురించి కొత్త ఆర్థిక అవసరాల గురించి మూఢ నమ్మకాలు ఇలాగే ఏర్పడతాయి. అయితే కాలం గడిచేకొద్దీ వాటి వెనక వున్న కారణాన్ని మరచిపోగా కేవలం తుప్పు మిగిలినట్లు మూఢనమ్మకం మాత్రమే మిగులుతోంది.

మూఢ నమ్మకాల మనిషి దేన్ని నమ్మాలనుకుంటాడో దాన్నే నమ్ముతాడు. దేనిని నమ్మాల్సిన అవసరం వుందో దాన్నే నమ్ముతాడు.

ఎప్పుడయితే ఆవేశం, భయం లోపలికి వస్తాయో అప్పుడు హేతువు, ఆలోచన బయటకు దారితీస్తాయి. దాంతో మొత్తం పరిస్థితిని నిర్ణయించేది కేవలం మూఢ నమ్మకం మాత్రమే! నరకం నుంచి బయట పడటానికి హామీ - మూఢ నమ్మకం!!

## సైన్స్‌కూ, మూఢ నమ్మకానికి లంకె!

ఇపుడు సైన్స్, మూఢ నమ్మకాలను పరిశీలిద్దాం

మౌలికంగా సైన్స్ మూఢ నమ్మకమూ - ఈ రెండూ మనోదృష్టికి సంబంధించినవి. ఒకటి పూర్తిగా హేతుబద్ధమైనదీ; పరీక్షకు నిలిచేది! మరోటి పూర్తిగా హేతురహితమైనది; ఉద్వేగభరితమైనదీ. మూఢ నమ్మకమనేది వ్యక్తిగతమైన విశ్వాసాలకూ, విషయ పరిజ్ఞానానికి సంబంధించింది. అయితే సైన్స్ మాత్రం ప్రయోగం, పరీక్ష, రుజువు ఆధారంగా గలది. మూఢ నమ్మకమనేది సాపేక్షమైనది. అది ఒక వ్యక్తి. ఒక ప్రత్యేక సమయంలో అతనికున్న శాస్త్రీయ విజ్ఞానం, అశాస్త్రీయతలం మీద ఆధారపడి వుంటుంది.

వాస్తవానికి సైన్స్ వుంటే మూఢ నమ్మకముంటుంది; మూఢ నమ్మకముంటే సైన్స్ వుంటుంది. కానీ అవి పరస్పర పూరకాలుగా కాదు. శాస్త్రీయ విజ్ఞానం అనేది ఒక హేతుబద్ధమైన అవగాహన. అందులో జడత్వం, ఆచారం, అద్భుతం వగైరాలకు చోటులేదు.

ఈ సైన్స్ మూఢ నమ్మకం అనే లంకె ఎంతవరకు విస్తరించి వుంది? సోషలిస్టు వ్యవస్థ నుంచి పరిణమించిన శాస్త్రీయ సంఘాన్ని శాసించే వ్యక్తికి శాస్త్రీయ దృక్పథం అంతిమ గమ్యం, అయితే సామాన్య ప్రజానీకానికి మాత్రం మూఢ నమ్మకం ఇలవేల్పు!

ఇలా కొత్తా, పాతా, సైన్స్, మూఢ విశ్వాసమూ అనేవి రెండూ కలసి వుంటాయి. మనదేశం వంటి అభివృద్ధిచెందుతున్న దేశాలలో ఈ రెండింటి మిశ్రమం మనుష్యులను చాలా ఎక్కువగా ప్రభావితం చేస్తుంది. ఈ ప్రభావం అవిచ్ఛిన్నం. ఇటువంటి విచిత్రమైన ముడి మనకు కొత్తగాదు. ఇది పశ్చిమ దేశాల్లో కూడా ఉంటోంది. సైన్స్ పురోగతిలో కూడా ఎన్నో ఒడుదుడుకులుంటాయి. ఇంకా కొన్ని సమయాల్లో మూఢ నమ్మకాలు శాస్త్రానికి స్పీడు బ్రేకర్లుగా పనిచేస్తాయి. చరిత్రకారులూ, సామాజిక శాస్త్రవేత్తలూ ఇదెందుకో వివరించడానికి ప్రయత్నించారు. ''సైన్స్, టెక్నాలజి అండ్ సొసైటీ ఇన్ ది సెవెన్‌టీన్త్ సెంచరీ ఇంగ్లాండు'' అనే పుస్తకంలో Merton ఇలా అంటాడు. ''... శాస్త్ర పోకడలకు ఎంతో దగ్గరి సంబంధం గల సమాజమూ; దాని నిర్మాణం, నమ్మకం, ఆశల సముదాయాన్ని ఉత్తేజపరచి, పరీక్షించి, సరిదిద్దేటువంటి ఒక సంస్కృతి ఫలితం, ఒక మేధాశక్తి రూపం - సైన్స్...'' అని నిర్వచిస్తాడు. అతడి ప్రకారం శాస్త్రజ్ఞుడు ఎన్నుకునే సమస్య అప్పటి ఆర్థిక, సామాజిక అవసరాల మీదనే ఎక్కువ ఆధారపడుతుంది.

ఈ దేశంలో బాగా చదువుకున్న వ్యక్తులు సైతం దివ్యమైన ఘడియలకోసం, మంచి ముహూర్తం కోసం వేచివుండటం సాధారణం. రాహుకాలం, యమగండం అనేవాటిని ఇంకా నమ్మడం జరుగుతోంది. సూర్యచంద్రులను, రాహుకేతువులు మింగితే సూర్య, చంద్రగ్రహణాలు ఏర్పడుతాయని ఇప్పటికీ విశ్వసిస్తున్నారు. చంద్రుడి మీద మనిషి తిరుగాడి వచ్చినా చాలామంది - కొంతమంది శాస్త్రవేత్తలు సైతం - జాతకాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇంతేకాకుండా వీటిని మించినది మరోటి వుంది - అది, రాబోయే చెడును తొలగించడానికి యజ్ఞాలు, గ్రహశాంతులు చేసి గ్రహగతులు మార్చడానికి ప్రయత్నించడం.

పునర్జన్మ వుందన్న నమ్మకం కూడా కొత్తదికాదు. Julian Huxley ఇలా అంటారు - పునర్జన్మ మీదగల నమ్మకం వల్ల చాలామంది పరలోకంలో మోక్షసాధనకై ఆరాటపడుతూ ఈ జన్మను నిర్లక్ష్యం చేస్తారు. ఇక ఈ జన్మను మెరుగుపరచుకోవటానికి ప్రయత్నం జరగదు. ఇంకా అసాధారణం, అద్భుతం వంటి వాటిని నమ్మడం వల్ల అవి తీవ్రమైన మూఢ నమ్మకాలకు దారితీయడమే కాకుండా, అవి ఆర్థిక పరమైన మోసాలకూ, దోపిడీకి దారితీస్తాయి.

ఒకవైపు లక్షలమంది ఆకలితో మలమల మాడుతోంటే మరోవైపు కొంతమంది యజ్ఞాల పేరుతో బస్తాలకొద్దీ ఆహార ధాన్యాల్ని అగ్నిదేవునికి ఆహుతిగా ఇస్తున్నారు! ఇదంతా ఎందుకంటే కొంతమంది 'తెలివైనవారు' మతం ముసుగులో దోపిడీ చేసేందుకే! మంత్రాలకు చింతకాయలు రాలితే జీవితం గడపటం అత్యంత సులువు. వర్షాకాలంలో కురిసే వర్షానికి యజ్ఞాలు చేయడం ఎందుకో!

మూఢ నమ్మకాలు మంచి వ్యాపారం చేయించగలవు. కొత్త పరిశ్రమలు స్థాపించగలవు. మూఢ నమ్మకాలు నిలదొక్కుకోవడానికి కొత్త టెక్నాలజీని రూపొందించడానికై ప్రయత్నాలు జరుగుతున్నాయి. మంత్రగత్తెలకూ, మాయలఫకీర్లకూ సాధన సామగ్రిని తయారు చేయడానికి కొత్త పరిశ్రమలు వెలుస్తున్నాయి. దీనిఫలం, తారాబలం, జ్యోతిషం వగైరాలు పత్రికలకు మంచి రాబడినిస్తున్నాయి. కంప్యూటర్ జాతకాల వ్యాపారం అమెరికాలో చాలా బాగా జరుగుతోంది. 18 మంది నోబుల్ బహుమతి గ్రహీతలతోపాటు 168 మంది ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన శాస్త్రవేత్తలు బహిరంగంగా జ్యోతిషాన్ని ఖండించారంటే - జ్యోతిషమెంత బాగా విస్తరించిందో అవగతమవుతోంది.

కొన్ని మూఢ నమ్మకాలు కచ్చితంగా మంచివి కావు. డబ్బు రెట్టింపు చేయడం, లోహాలను మార్చటం, నరబలితో పుత్రసంతానం పొందగల్గటం వగైరాలు తీవ్రమైన విషాదానికి దారితీస్తాయి.

మరో దారుణమైన విషయమేమంటే మూఢ నమ్మకాలు వ్యక్తుల మనోస్థైర్యాన్ని దెబ్బతీసి అసహాయులను చేస్తాయి. దీనివల్ల అసలు సమస్యా; దాని కారణము అర్థం కాదు. అటువంటి సమయంలో మూఢ నమ్మకాలను నివారించేందుకు ప్రయత్నాలు అసలు జరగవు.

మూఢనమ్మకాల పెరుగుదల - ప్రజల అజ్ఞానం మీదా, శాస్త్ర విజ్ఞానం మీదగల అవిశ్వాసం మీద ఆధారపడుతుంది. ఈ మూఢనమ్మకాలు, అంధ విశ్వాసాలు కలసి మానవ పురోగతిని నివారించడమే

కాకుండా ముఖ్య సమస్యలను పెడత్రోవ పట్టించి, మానవ గమ్యానికి సంబంధించిన దృష్టిని నాశనం చేస్తున్నాయి. అయితే శాస్త్రం విస్తరించేకొద్దీ మూఢ విశ్వాసాల పరిధి కుచించుకుపోతుంది. అయినా మూఢ విశ్వాసాలు ఇంకా వ్యాపించి వున్నాయి.

## మూఢ నమ్మకాలు శాస్త్రబద్ధమైనవా?

జ్యోతిషం, హస్తసాముద్రికం, గంగాజలం, నుదుటి తిలకం, విభూతి, అతీంద్రియ ధ్యానం గురించి - సైన్స్ వివరణ ఇవ్వటానికి ఎన్నో ప్రయత్నాలు జరగుతున్నాయి.

అయితే, ఇలా ఇచ్చిన వివరణలు తిరగబడుతున్నాయి. Tremb ఇలా వాదిస్తాడు - గ్రహాలు, నక్షత్రాలు, భూమి విద్యుదయస్కాంత మండలాన్ని ప్రభావితం చేస్తుందని, అది మానవ ప్రవర్తనను నిర్దేశిస్తుందని! ఇంకా అతను జ్యోతిష్యానికి ఆధారంగా పుట్టిన తేదీని తీసుకోవడంలో జ్యోతిష్కులు పప్పులో కాలువేశారంటాడు. పుట్టిన తేదీకి బదులు తల్లి, తండ్రి కలిసిన ఘడియను పరిగణనలోకి తీసుకోవాలంటాడు. ఇలా ఇదంతా అనవసర పైత్యానికి దారితీస్తుంది.

## కుహనా శాస్త్ర విజ్ఞానం

మరో విపత్కర పరిస్థితి ఏమంటే - సైన్స్ అని ముద్ర వేసుకోవడానికి కుహనా (Pseudo) సైన్స్ ప్రయత్నం చేస్తోంది. ''ఇన్ ది నేమ్ ఆఫ్ సైన్స్'' అనే పుస్తకంలో మార్టిన్ గార్డినర్ (Martin Gardener) కుహనా సైన్స్ కోసం ఎంతో మేధాశక్తి నాశనమవుతోందని ఇది శాస్త్రవేత్తలను, సైన్స్‌ను పెడత్రోవ పట్టిస్తుందని అభిప్రాయపడతారు.

శాస్త్రజ్ఞులకు మూఢ నమ్మకాలు లేవనుకోవడం మరో పెద్ద మూఢ నమ్మకం! శాస్త్రజ్ఞుడు సులువుగా మోసం చేయవచ్చని గార్డినర్ అంటాడు. అత్యంత ప్రతిభావంతులు మాత్రమే బూటకం ఆట కట్టిస్తారని, చాలామంది అనుకుంటారు. కాని అది నిజం కాదు. మేజిక్ మర్మం తెలియని వాడిని మోసం చేయటం ఎంతో తేలిక!

మన దేశంలో కుహనా విజ్ఞాన శాస్త్రాలు, కుహనా శాస్త్రవేత్తలు చాలామంది వున్నారు. ఈ దేశంలో ఎన్ని మూఢ నమ్మకాలు వున్నాయో అని ఎవరైనా ప్రయత్నించి, తేలిస్తే అది ఘనకార్యమే! మంత్రగాళ్ళు, దైవాంశ సంభూతులు, యోగులు, జ్యోతిషులు మొదలైన వారు వారపత్రికలలో ఆక్రమించే స్థలాన్ని బట్టి వారిని నమ్మేవారు ఇంకెంతమంది వున్నారో విశదమవుతుంది.

భారతదేశం ఇలా వుండటానికి కారణం లేకపోలేదు. చాలామంది శాస్త్రవేత్తలు ఉభయచరాలు (Amphibias) - ప్రయోగశాలలో శాస్త్రవేత్త, ఇంట్లో మూఢ విశ్వాసి! డాక్టర్లు రుద్రాక్షలు ధరిస్తారు. శాస్త్రవేత్తలు దేవుడి ముందు కొబ్బరికాయ కొట్టి తమ మనోసిద్ధి నెరవేరాలంటారు. ఆచార భూయిష్టమైన, మూఢ నమ్మకాల నిలయమైన ఈ సమాజంలో సైన్స్ మొగ్గదశ దాటని పువ్వు! ఇక ఎప్పుడు ప్రగతి వెలుగుచూస్తుంది?

విజ్ఞాన శాస్త్రం, శాస్త్రీయ దృక్పథం, ఎలా ఈ మూఢ నమ్మకాలను, వాటి విషఫలాలను ఎదుర్కొంటాయన్నది మరో ప్రశ్న.

## మూఢ నమ్మకాలు వుండిపోతాయా?

మూఢ నమ్మకాలతో వచ్చిన తలనొప్పి ఏమంటే - వాటిని నమ్మడం చాలా తేలిక. అయితే రూపుమాపడం ఎంతో కష్టం.

ఈ మూఢ నమ్మకాల వల్ల ఏమైనా ఉపయోగముందా? ఏదో పరలోకంలో పుణ్యగతి వస్తుందన్న ఆధారంలేని నమ్మకం తప్ప, ఏమైనా ప్రయోజనం వుందా?

జననం మరణం, భయం, సందేహం వగైరాలు లేకపోతే మూఢ నమ్మకాల అవసరం వుందా? సరే, మనిషికి మూఢ నమ్మకం వుండనీ! అయితే అప్పుడు మనిషి తన పరిస్థితిని శాసించగలడా?

మూఢ నమ్మకాలను కొందరు పూర్తిగా విశ్వసిస్తారు. మరికొందరు పూర్తిగా వ్యతిరేకిస్తారు. అయితే చాలామంది ఈ రెండు దృక్పథాలకు మధ్యస్థంగా వుంటారు. కొందరు మహానుభావులు బయట విమర్శిస్తూ, ఇంట్లో తు.చ. తప్పక పాటిస్తారు. పెద్దలకు గౌరవం ఇవ్వడానికి కొందరు మూఢ నమ్మకాలను విశ్వసిస్తారు. మరికొందరు మూఢ నమ్మకాలను పాటించటం ఎందుకంటే - ఈ భూమండలం మీద ప్రతి పాపానికీ తప్పించుకునే మార్గం ఏదో ఒకటి వుంది. లేదంటే లేదు. ఏదైనా వుంటే కనుక్కో-లేదంటే మరచిపో - అనే దృష్టి కారణం కావడం, ఇంకా కొందరు '' ఎందుకు మూఢ నమ్మకాలను సందేహించడం? వాటితోనే కలసి నడుద్దాం'' అనే దృష్టితో మూఢ నమ్మకాలు పాటిస్తారు. గొర్రెదాటు మనస్తత్వం (గుంపు మనస్తత్వం) వల్ల కూడా మూఢ నమ్మకాలను విశ్వసిస్తున్నారు.

సైన్స్ వ్యాప్తితో మూఢ నమ్మకాలు తొలగిపోతాయని కొందరు విశ్వసిస్తారు. మరికొందరు మూఢ నమ్మకాలను జీవన పద్ధతిగా పరిగణిస్తారు. వైద్యశాస్త్రం, విజ్ఞానశాస్త్రం కొత్త ఆవిష్కరణలు కొత్త రోగాలు మూఢ నమ్మకాలకు దారితీస్తాయని ఉదహరిస్తారు. కొత్త మందులతో కొత్త రోగాలను వైద్యులు అంతం చేయాలి. అలాగే విద్యావేత్తలు హానికరమైన మూఢ నమ్మకాలను రూపుమాపాలి.

## మనిషి - ఇంగితం, అసంగతాల మిశ్రమం!

మనిషి హేతుబద్ధమూ, హేతురహితమూ! మనిషికి మెదడు, శరీరం వుంది. దానిని సృజనాత్మకంగా ఉపయోగించుకొనే వీలుంది. సైన్స్ అనేది ఒక పనిముట్టు. అది అసంగత ధోరణులను తగ్గించి, హేతుబద్ధమైన ఆలోచనలను పెంచాలి. ద్విగుణీకృతమైన ఫలితం రాబట్టాలి. దానితో జీవనం మరింత అర్థవంతం కావాలి. హేతురహితమైన పోకడల నుంచి మనిషిని విడుదల చేసి, వాటి ప్రమేయం తగ్గించి, ఉత్పత్తి రేటును పెంచాలి.

నైపుణ్యం, ఆలోచన, ప్రవర్తలను సైన్స్ ప్రభావితం చేయడం కాకుండా, సంప్రదాయం, మూఢ నమ్మకాల వల్ల వాటికి ఎదురయ్యే ఘర్షణను తగ్గించాలి. ఈ మూఢ నమ్మకాలు, ఆచారాలు, సంప్రదాయ

పద్ధతులు, వాటి ప్రభావమూ తగ్గాలంటే జిజ్ఞాస, విమర్శనాత్మకంగా ప్రశ్నించగలగడం, శాస్త్రీయ దృక్పథం పెరగాలి. ఇంకా అవి మన జీవనంలో కలసిపోవాలి.

రాగద్వేష రహితమైన నిర్ణయం చేయగల శక్తిని విద్య ఇవ్వగలగాలి. ఈ విశాల దృక్పథం గల విద్య మన జీవితాల్లో హేతుబద్ధతను, సదాశయాలను నిర్ణయిస్తాయి.

నేడు కళాశాలల్లో, ఉన్నత పాఠశాలల్లో తగిన ప్రయోగశాలలు, పరికరాలు లేక శాస్త్రబోధన కేవలం మేజిక్కు అవుతోంది. సరైన ప్రయోగాలతో, వాటి ప్రదర్శనతో సైన్స్ సామాన్యుడి ముందు నిలవాలి. కేవలం సరైన విద్యయే భవిష్యత్తరాలకు అర్థవంతమైన దారి చూపగలదు.

ఆధునిక విజ్ఞానశాస్త్రం ఎలా పరిఢవిల్లిందో కొంచెం పరిశీలిద్దాం.

బ్రిటీషువారి పాలనలో వారి శాస్త్ర విజ్ఞానంలో భాగంగా పెరిగింది భారతదేశ విజ్ఞానశాస్త్రం. అందువల్ల పాశ్చాత్య దేశాలలో వలె - వునికిలో వున్న ధోరణులను, మేధోపోకడలను ప్రశ్నించగల స్ఫూర్తి విద్యకు ఏనాడు లేదు. సూర్యకేంద్రక సిద్ధాంతం, పరిణామ సిద్ధాంతం నిలదొక్కుకోవడానికి బహిరంగంగా పోరాడవలసి వచ్చింది. పాశ్చాత్య దేశాలలో ఈ సుదీర్ఘ పోరాటంలో ప్రతిసారీ సైన్స్‌నే విజయం వరించడమే కాక - పద్ధతి, పరిశీలనలు మీద కొత్త అభిప్రాయాలు ఏర్పడ్డాయి. కొత్త విలువలు, ఊహలు గల వ్యవస్థ ఏర్పడటానికి దోహదకారులయ్యాయి.

మన దేశంలో సైన్స్ ఇటువంటి దశలు ఏవీ లేకుండా కేవలం పాఠశాలల్లో కళాశాలల్లో బోధించే విషయంగా మిగిలిపోయింది. ప్రొఫెసర్ బెర్నాల్ అభిప్రాయం ప్రకారం - అన్ని ఇతర రంగాలలో లాగా శాస్త్ర రంగంలో కూడా ప్రతి భారతీయుడు దీన్ని కూడా జాతీయ అవసరంగా భావించడం తప్పనిసరిగా జరగాలి. అయితే ఇది అంత సులభంగా జరగదు. దీన్ని బ్రిటీష్ వారి నుంచి నేర్చుకోవాల్సివుంది. అయితే బ్రిటీష్‌వారు దాన్ని ప్రోత్సహించవచ్చు. లేదా అవమానించవచ్చు. తెలివైన ఊహలకూ ఆసక్తికరమైన ప్రయోగాలకు భారతీయులు పేరెన్నికగన్నారు. అంతేకాదు అవిశ్వసనీయమైన ప్రయోగాలకు కూడా భారతదేశం పేరుపొందింది. ఇంతేకాకుండా ఉభయ చరాలైన శాస్త్రవేత్తలు కూడా బాగా ఎక్కువయ్యారు.

స్వాతంత్ర్యం రాగానే శాస్త్రజ్ఞులలో ప్రజలలో సమూలమైన మార్పు వస్తుందని ఆశించడం జరిగింది. ప్రభుత్వం రూపొందించే ప్రణాళికలు, కార్యక్రమాలలో శాస్త్రీయ దృక్పథం అంతస్సూత్రంగా వుంటుందని కూడా ఆశించడం జరిగింది. అయితే స్వాతంత్ర్యం వచ్చిన తరువాత శాస్త్రవేత్తల సంఖ్య, ప్రయోగశాలల సంఖ్య వాటికయ్యే ఖర్చు పెరిగిందే కానీ శాస్త్రీయ దృక్పథం వ్యాప్తి చెందలేదు, శాస్త్రీయ ఉద్యమం రాలేదు.

దీనికి కారణం పూర్తిగా తెలియదు. మతానికి సంబంధించిన మౌలిక విషయాలలో కాకుండా, సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక విషయాలలో, వాటి దృక్పథాలలో మార్పు లేకపోవడమే. దీనికి ఉభయ చరాలైన శాస్త్రవేత్తలు కూడా కారణం కావచ్చు.

అయితే నేడు పరిస్థితి మారుతోంది.

నేడు మునుపటికన్నా ఎక్కువగా శాస్త్రీయదృష్టి, శాస్త్రీయ దృక్పథం, శాస్త్రీయ స్ఫూర్తి, శాస్త్రీయ ఉద్యమాలు విస్తరించడం జరుగుతోంది. మూఢనమ్మకాలు, అంధవిశ్వాసాలపై నేడు బహిరంగ చర్చలు, సభలు జరుగుతున్నాయి. ప్రభుత్వం సైతం శాస్త్ర, సాంకేతిక విజ్ఞానంతో సాంఘిక వ్యవస్థను మార్చవచ్చునని ఆశిస్తోంది. ''శాస్త్రీయ దృక్పథం కేవలం ప్రయోగశాలలకే మిగిలిపోకుండా జీవన పద్ధతిగా విస్తరించాలి' అని శ్రీమతి ఇందిరాగాంధీ అభిప్రాయపడ్డారు. మూఢ నమ్మకాలు ఎదుర్కొనడానికి శాస్త్రీయ దృక్పథాన్ని సామాన్య ప్రజానీకంలో విస్తరింపచేయాలంటే మూడు మార్గాలున్నాయి.

మొదటిది - చిరుత ప్రాయంలోనే దిద్దడం. అంటే పాఠశాల స్థాయిలో విజ్ఞాన శాస్త్రాన్ని బోధించడం. రెండవది - గ్రామీణ ప్రజానీకానికి శాస్త్ర, సాంకేతిక ఫలితాన్ని దగ్గరిగా తీసుకువెళ్ళి, వారి సమస్యలను పరిష్కరించడం. ఇలా గ్రామీణుల ముంగిటకు తీసుకువెళ్ళడం వల్ల మరో ఉపయోగం వుంది. మూఢ విశ్వాసాల్ని, అంధ విశ్వాసాల్ని, అద్భుత శక్తుల్ని గురించి వ్యాపించి వున్న అసంగత భావాలను తొలగించి హేతువాద దృష్టి, శాస్త్రీయ దృష్టి, స్ఫూర్తి మొదలైన వాటిని వ్యాపింప చేయడానికి వీలవుతుంది. మూడవది - శాస్త్రీయ దృష్టికి సంబంధించిన క్లాజును భారత రాజ్యాంగంలో చేర్చగలగడం. మన రాజ్యాంగం 51 (A) (h) ప్రకారం శాస్త్రీయ దృష్టిని, మానవతా వాదాన్ని, శాస్త్రీయ స్ఫూర్తిని, సంఘ సంస్కరణాభిలాషను పెంపొందించడం ప్రతి పౌరుడి కర్తవ్యం.

సామాజిక సంక్షేమం కోసం శాస్త్ర, సాంకేతిక రంగాల్ని ఉపయోగించడం అనేది ప్రభుత్వ ప్రధాన కర్తవ్యం! ఆరోగ్యం, కుటుంబ నియంత్రణ, సాంఘిక సంస్కరణ మొదలైన వాటిలో పెక్కు మూఢనమ్మకాలు, అసంగత భయాలు పెనవేసుకుని వుంటాయి. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి ఒకే ఒక మార్గం సామాన్యుడిని శాస్త్రీయంగా ఆలోచింపచేయడం! ''మన జీవితాల్ని చీకటిమయం చేస్తున్న అంధ విశ్వాసాల్ని తొలగించడానికి; సాహసం చేయగల ఉత్తేజాన్ని యివ్వడానికీ, భవిష్యత్తును చూడగల, దిద్దగల మేధస్సును అందుకోవడానికి మనకు శాస్త్రీయ అవగాహన చాలా అవసరం.''

ఈ జాతీయ కర్తవ్యంలో భారత శాస్త్రవేత్తకు తగిన పాత్ర వుంది. ఈ గురుతర బాధ్యతను నిర్వహించాల్సింది శాస్త్రవేత్తయే! అర్థంలేని భావనలు, మూఢనమ్మకాలు, అసంగత అభిప్రాయాలు తొలగాలి. శాస్త్రీయ విజ్ఞానం నాలుగు చెరగుల పరచుకోవాలి. ఈ మార్గం నడక మందకొడిగా వుండవచ్చు. అయితే మన సమాజాన్ని శాసించే విభిన్న ధోరణులను, వాటి గమనాన్ని అర్థం చేసుకోవాల్సిన అవసరం శాస్త్రవేత్తకు ఎంతైనా వుంది.

# చిత్తప్రసాద్ అంతర్యంలో శ్రమైక జీవన సౌందర్యం

- డాక్టర్ దేవరాజు మహారాజు

1978లో కలకత్తా నగరంలో ఒక ఘోరం జరిగిపోయింది. అది ఘోరమని అప్పుడక్కడి ప్రజలకు తెలియలేదు. భారతదేశం సగర్వంగా చెప్పుకోదగ్గ ఒక మహా చిత్రకారుడు ఆ సంవత్సరం అక్కడ మరణించాడు. అతని గూర్చి, అతని చిత్రాల గొప్పతనం గూర్చి అక్కడ ఎవరికీ తెలియదు. అందుకే అతని మరణంలోని విషాదాన్ని అతను లేకపోవడం వల్ల కలిగే లోటును, ప్రజలు అంచనా వేసుకోలేక పోయారు. ప్రభుత్వం సైతం బిక్కముఖం వేసింది.

**ఆ అమర చిత్రకారుడు - చిత్త ప్రసాద్!**

1915లో పుట్టిన 'చిత్త' 1978లో తన అరవై మూడవ యేట శాశ్వత విశ్రాంతి తీసుకున్నాడు. ఈ దేశం మేధావులకు, శాస్త్రవేత్తలకు, కళాకారులకు సరైన సమయంలో సరైనగుర్తింపు నివ్వదు - అన్నది అపవాదు కాదు, అక్షరాలా నిజం. అది చిత్త ప్రసాద్ మరణం నిరూపించింది. మరణం తర్వాతనే దేశం ఆయనను గుర్తించింది. బెంగాల్ విభజనకు ముందు జన్మించిన 'చిత్త' జీవితంలో ఎక్కువ భాగం ముంబాయిలోని అంధేరి ప్రాంతంలో గడిపారు. మురికి వాడల్లో మురికి మనుషులతో కలిసి తిరిగారు. నిరంతరం శ్రమించారు. శ్రమ విలువను ఎలుగెత్తి చాటే అమోఘమైన చిత్రాల్ని రచించారు. అతని చిత్రాల్లోని బలమైన గీతలకు, స్థిరత్వానికి, భావుకతకు దేశ కళా కారులందరూ అచ్చెరు వొందారు. అతని చిత్రం దేశంలోని ఏ ఆర్ట్ గ్యాలరీ, ఏ మ్యూజియమూ భద్ర పరచలేదు. అప్పటికి ఆయన అనామకుడేమో అని అనుకోవడానికి కూడా వీలులేదు. అప్పటికే రష్యా, అమెరికా, జకొస్లొవేకియా, డెన్మార్క్, టాంజానియా దేశాల్లో ప్రసిద్ధులు. ఆయన అనుచరులు అక్కడ ఎంతోమంది పనిచేస్తూ వుండే వారు. వారు వారి వారి దేశాల్లో ఎన్నో ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. విచిత్రమేమంటే చిత్తప్రసాద్ బతికి వుండగా భారతదేశంలో ఆయన చిత్రాల ప్రదర్శన ఒకే ఒక సారి జరిగింది. అతని మరణం తర్వాతనే అతని చిత్రాల ప్రతిరూపాలు (copies) ప్రాగ్ - నేషనల్ మ్యూజియం నుంచి తెప్పించుకోవాల్సి వచ్చింది. ఒకగొప్ప చిత్రకారుడి పరిస్థితే ఈ విధంగా ఉంటే, ఇక మామూలు చిత్రకారుల విషయం ఊహించుకోవచ్చు.

చిత్త ప్రసాద్ మన దేశంలో యాదృచ్ఛికంగా బయట పడ్డారు. ఏదో ఒక పాత పుస్తకంలో 'చిత్త' చిత్తర్వులు బయట పడడం, అది చేతులు మారుతూ పెద్ద పెద్ద చిత్రకారులు పరిశీలనకు పోవడం జరిగింది. చిత్రాలలోని పనితనం పలువురికి పని కల్పించింది. ఎవరీ చిత్రకారుడు? అని అన్వేషణ మొదలయ్యింది. ఫలితంగా ఏవో కొద్ది వివరాలు మాత్రం లభించాయి. చిట్టగాంగ్‌లో పాఠశాల చదువు పూర్తి చేసుకున్న చిత్త, అక్కడి చిత్రకారుల చిత్రాలెన్నో పరిశీలించాడు. రంగులు, రంగుల సమ్మేళనం గూర్చి తెలుసుకున్నాడు. జీవితంలోని ఆచార వ్యవహారాలు, సాంస్కృతిక కార్య కలాపాలు అవగాహన చేసుకున్నాడు. జానపద కళారీతుల్ని అవగతం చేసుకున్నాడు. ఎవరి దగ్గరా శిష్యరికం చేయలేదు. తనలో నుంచి తన్నుకొచ్చిన 'కళ' కు కుంచెతో ఒక రూపాన్నివ్వడం ప్రారంభించాడు.

ఆ సమయంలోనే ఆయనకు భారత కమ్యూనిస్టు పార్టీతో పరిచయం పెరిగింది. ఆలోచనా ధోరణిలో చాలా మార్పు వచ్చింది. పార్టీ కార్యకలాపాల్లో ఆయన చురుకుగా పాల్గొనేవారు. మంచి భవిష్యత్తుగల చిత్రకారుడిగా పలువురికి అప్పటికే పరిచయమయ్యారు. లలిత కళల కళాశాలలో చేరదామనుకున్నారు. కాని వామపక్ష రాజకీయాలలో పాల్గొంటున్నందుకు గాను, అప్పటి ప్రభుత్వ

డా॥ దేవరాజు మహారాజు, కవి, రచయిత, హైదరాబాదులో నివాసం.

కళాశాలలో 'చిత్త'కు ప్రవేశం లభించలేదు. అధైర్య పడకుండా 'చిత్త' శాంతినికేతన్ వెళ్ళారు. అందులో ప్రవేశించి, అక్కడి కళాభవన్‌లో తన పేరు నమోదు చేయించుకోవడం కోసం, విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్‌ను కలుసుకున్నారు. కనురెప్పపాటులో ఆయన బొమ్మగీసి చూపించారు. 'చిత్త' గీసిన ఆ గీతలలో మేధస్సే కాదు, దాంతోపాటు బహిర్గతమైన పరిపూర్ణ ప్రతిభను విశ్వకవి గుర్తించారు. జీవితాన్ని అందులోని లయని, మామూలు గీతల్లో ప్రతిఫలింపజేయగల సామర్థ్యం సామాన్యమైనది కాదని, విశ్వకవికి తెలుసు. అందుకే విశ్వ విద్యాలయాల్లో విద్యార్థిగా సమయం వృధా చేసేకంటే... తన ధోరణిలో తాను సాధన చేసి గొప్ప కళాకారుడిగా గుర్తింపు పొందడం మంచిదని ఆయన సలహా ఇచ్చారు. 'చిత్త' ఆ సలహాను పాటించారు. తన సామర్థ్యాన్ని నిరూపించుకుని, రవీంద్రుడి ఊహను నిజం చేశారు.

వామపక్ష రాజకీయాలతో ఏర్పడిన గాఢ పరిచయం వల్ల చిత్త ప్రసాద్ ఒక కొత్త వ్యక్తిత్వాన్ని సంతరించుకున్నారు. ప్రజల పట్ల, శ్రమ పట్ల ఆయనకు గౌరవం పెరిగింది. దోపిడీని, దాని భిన్న స్వరూపాల్ని, స్వభావాల్ని ఆకళింపు చేసుకున్నారు. దోపిడీ చేయబడుతున్న కార్మిక, కర్షక, రైతు కూలీలే తన వాళ్ళని, వారి సాధక బాధకాలే తన చిత్రాల్లో ప్రతిబింబించాలని ఆయన ఒక నిశ్చయానికి వచ్చారు. 1935-46 మధ్యకాలంలో అంటే ఆయన చిత్రాలు వేస్తున్న తొలి దశలో ఆయన అలాంటి చిత్రాల్నే ఎక్కువగా గీశారు. అతని చిత్రాలలో ఎక్కువ గుర్తింపు పొందిన ''పనివాళ్ళు'', ''వృద్ధులు'', ''స్త్రీలు - పిల్లలు'' వంటి చిత్రాలన్నీ జీవితానికి అతి దగ్గరగా ఉన్నాయి. జీవితంలో లేని రంగులు అందంగా పులిమి గొప్ప చిత్రకారులని కొందరు పేరు ప్రఖ్యాతులు సంపాదించుకుంటున్న తరుణంలో - వాస్తవ జీవితాన్ని చిత్రించి ఇదీ నిజమైన చిత్రకళ అని చెప్ప గలిగిన చిత్రకారుడు చిత్త ప్రసాద్. ఆయన చిత్రాలలో 'పనివాళ్ళు' తమను తాము చూసుకోగలిగారు.

రెండవ ప్రపంచ యుద్ధం, బెంగాల్ కరువు, క్విట్ ఇండియా ఉద్యమం వగైరా వగైరా - 1930లో భారత దేశంలోని విపత్కర పరిస్థితుల్లో 'చిత్త' ప్రత్యక్షంగా, పరోక్షంగా ఒక భాగమైపోయ్యారు. దేశానికి స్వాతంత్ర్యం లభించడానికి కొద్ది కాలం ముందే ఆయన కలకత్తా వదిలి బొంబాయి చేరుకున్నారు. వామపక్ష పత్రికలకు పని చేశారు. రాజకీయ కార్టూన్‌లు, వాటర్ కలర్ పెయింటింగ్స్, ఆయిల్ పెయింటింగ్స్, పేస్టల్స్, లినోకట్స్ వగైరా ఎన్నో చేశారు. జీవనోపాధికి ఎన్నెన్నో చేసినా వీటికి అతీతంగా ఆయన ఆలోచనలు మానవత్వం వైపు, ప్రపంచ మానవాళి శ్రేయస్సువైపు సాగాయి. ఫలితంగానే అద్వితీయమైన కళాఖండాలు వెలువడ్డాయి. కవిత్వమూ- కథలూ వచ్చాయి. ఆయన దృష్టి పిల్లల వైపు కూడా మళ్ళింది. తాతమ్మ చెప్పే కమ్మని కథలక్కూడా నోచుకోని ఈ దేశంలోని లక్షలాది పసిపిల్లలు కళ్ళలో మెదిలారు. ఫలితంగా 1952లో ''ఏంజిల్స్ విథవుట్ ఫెయిరీ టేల్స్'' చిత్రంగా బయటికొచ్చింది. దీన్ని యూనిసెఫ్ పలుచోట్ల ప్రదర్శించింది. చిత్త ప్రసాద్ బొమ్మల రామాయణం మొదలు పెట్టారుగాని, అది అసంపూర్తిగా మిగిలిపోయింది. అంతిమ దశలో ఆయన పిల్లల పుస్తకాల కోసం ఎంతో కృషి చేశారు. సమకాలీన జీవితంలోని నగ్న సత్యాల్ని బట్టబయలు చేస్తూనే భవిష్యత్తు పట్ల, మానవత్వం పట్ల, మానవ సంబంధాల పట్ల, అచంచలమైన విశ్వాసాన్ని వెలిబుచ్చారు. 'ఆశ' జీవితానికి ముఖ్యమని, దాన్ని తన చిత్ర రచనలన్నింటిలో ప్రతిఫలింపజేశారు. చిత్త ప్రసాద్ జీవితం, కళానైపుణ్యం ఇప్పటికీ అజ్ఞాతంగానే ఉన్నాయి. కళాప్రియులు, ద్రష్టలు, పరిశోధకులు ఇతర దేశాలలో ఉండిపోయిన ఆయన చిత్ర రచనల్ని పరిశీలించి, ప్రతులు తెప్పించి, విశ్లేషించి కొత్త విషయాలు భారతీయ పాఠకులకు అందించాల్సి ఉంది. దేశం గర్వించదగ్గ ఈ చిత్రకారుడి గూర్చి, లలిత కళలకు సంబంధించిన విశ్వవిద్యాలయ శాఖలు, అకాడెమీలు, సంస్థలు ఎంతో శోధించాల్సి ఉంది.

## చలసాని ప్రసాదరావు కలం నుండి చిత్తప్రసాద్

''భారతదేశంలోని కళాకారుడెవరూ కూడా తన నైతిక, రాజకీయ దృక్పథాల్ని వ్యక్తపరచకుండా ఉండలేడు. కళను ఈ దేశ ప్రజల వాణిగా మలిచే సంప్రదాయాన్ని సృజించే మార్గం అన్వేషించకుండానూ ఉండలేడు'' అనే అవగాహన చిత్తప్రసాద్‌ది.

కనుకనే, ఈనాడు మనం స్మరించదగిన సృజనశీలిగా, అత్యల్పకాలంలోనే అనితర సాధ్యమనదగిన స్థాయికి తన కళను అభివృద్ధి పరచుకున్న ప్రజా కళాకారునిగా ఎదగగలిగాడతను.

అరవై మూడేళ్ళ జీవిత కాలంలో కనీసం నలభయ్యేళ్ళపాటు అతని కళా సృజన నిర్విరామంగా కొనసాగింది. లెక్కకు అందని అసంఖ్యాకమైన కళాఖండాల్ని అతనీ దేశ ప్రజలకు కానుకగా అందించాడు. అవన్నీ అతని ప్రత్యేకతను చాటిచెప్పేవే. జీవితం నుండి గ్రహించినవే.

అయితే చిత్తప్రసాద్ కేవలం జీవితాన్నే చిత్రించి ఊరుకోలేదు. ఆ జీవితం అలా ఎందుకు ఉందో కూడా స్ఫురింపజేశాడు. అలా ఉండకూడదని కోరుకునే వారి పక్షాన్న నిలబడ్డాడు. వారి పోరాటాల్ని బలపరిచాడు. తన చిత్రాల ద్వారా కేవలం బలపరచడం కాదు, తన చిత్రాల్ని చూసినవారు ఆ పోరాటాల్ని సమర్థించకుండా ఉండలేని విధంగా ఉత్తేజకరంగా వాటిని రూపొందించాడు.

ముప్పయ్ లక్షల మంది అమాయక ప్రజల్ని కబళించిన చరిత్ర ప్రసిద్ధమైన బెంగాల్ కరువు ప్రాంతాల్లో 1943-44లో స్వయంగా పర్యటించాడు. గుండెల్ని పిండే ఆకలి చావుల్ని చిత్ర బద్ధం చేసేడు. పొట్టలు పెంచుకున్న బ్లాక్ మార్కెటీర్లను, వారికి అండగా నిలిచిన బ్రిటిష్ పాలక వర్గాన్ని తన శక్తివంతమైన కళలో బహిర్గతం చేసేడు. పాలక వర్గాలు హడలిపోయేట్లు వాటిని రూపొందించేడు. వాటిని ప్రచురించిన పత్రికాధిపులే భయపడి ఆ తరువాత వాటిని ధ్వంసం చేసేసినంత శక్తివంతమైన వా సజీవ దృశ్యాలు.

''ఈ దేశంలో చిత్రకారునిగా జన్మించటం సులభం, నిలదొక్కుకోవటమే కష్టం'' అనే మాటను అబద్ధం చేసేడు చిత్తప్రసాద్. అందుకు కారణం అతను ప్రజల పక్షాన నిలబడటమే. తన కళను జీవనోపాధిగా మలచుకోడానికి అతను సదా నిరాకరించేడు. మార్క్సిజాన్ని మనసా, వాచా, కర్మేణా నమ్మి అనుసరించేడు. ''రాజకీయాల్లో పాల్గొన''నని రాసి ఇస్తే తప్ప సీటు ఇవ్వనన్న కలకత్తా గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ ప్రిన్సిపాల్‌నే కాదన్నాడు. ప్రజల మధ్యనే తన కళకు మెరుగులు దిద్దుకున్నాడు. ''నీకు మేము నేర్పేదేమీ లేదు. నీ పద్ధతిలోనే అలా వేస్తూ వెళ్లు. ఒకనాటికి మమ్మల్ని మించిపోతావు'' అని శాంతినికేతన నిర్వాహకులు రవీంద్రనాథ్ టాగూర్, నందలాల్‌బోస్ ప్రశంసించే స్థాయికి ఎదిగిపోయేడు.

21 జూన్ 1915న బెంగాల్‌లోని 24 పరగణాల జిల్లా, మిడ్నపూర్‌లో జన్మించేడు చిత్తప్రసాద్ భట్టాచార్య. తల్లిదండ్రులు సాహిత్య, సంగీతాల్లో ప్రవేశం ఉన్న వారేగనుక ఇతని కళాభిరుచికి ప్రోత్సాహమే లభించింది. తండ్రి ఉద్యోగ రీత్యా బెంగాల్ అంతటా తిరుగుతూంటే తనూ తిరిగేడు. గ్రామ సీమల అందాల్ని ఆకళించుకోవటమేకాదు, ప్రజల జీవన సమరాల్ని గుర్తించేడు. వారి కోసం తపించనారంభించేడు.

విప్లవ కార్యకలాపాలకు కేంద్రమైన చిట్టగాంగ్, బంకూరాలలో విద్యాభ్యాసం కొనసాగించేడు. తొమ్మిదిసార్లు వరసగా జపాన్ బాంబు దాడులకు గురైన చరిత్రాత్మక స్థలం చిట్టగాంగ్. బ్రిటిష్

సైన్యానికి అతివాద భారత జాతీయవాదులకూ 1930-34 మధ్య చిట్టగాంగ్ ఒక యుద్ధభూమి. సాయుధ పోరాటాలకు గెరిల్లా దాడులకు అదొక కేంద్రం. అక్కడ ఇంటర్ చదివి ప్యాసయ్యాడు చిత్త ప్రసాద్. అభ్యుదయ రచయితల సంఘం, భారత ప్రజానాట్య మండలి తొలి రోజుల నుండి వాటితో అనుబంధం పెంచుకున్నాడు. కమ్యూనిస్టుల ''పీపుల్స్ వార్'' పత్రికలలో పనిచేశాడు. చిత్తప్రసాద్ చిత్రకారుడే గాదు, స్వయంగా కవి, గాయకుడు, రచయిత. 1945లో కలకత్తాలో జరిగిన ''ఫాసిస్టు వ్యతిరేక రచయితలు - కళాకారుల'' వార్షిక సభలో చిత్తప్రసాద్ పాటలు రెండింటిని ప్రజానాట్యమండలి వారు గానం చేయగా శ్రోతలు ఉర్రూతలూగేరు. అతని కవితలు ఆనాడే రెండు సంపుటాలుగా వెలువడ్డాయి. బెంగాలీ జానపద గాథలను స్వంత బాణీలో తిరగరాసి తన బొమ్మలతో సహా ఒక సంపుటంగా ప్రచురించేడు.

చిత్రకారునిగా చిత్తప్రసాద్ మనదేశంలోని అభ్యుదయ, అతివాద, కమ్యూనిస్టు ఉద్యమాలకు చేసిన సేవ మరువలేనిది, మరువరానిది, సాటిలేనిది. ''కళను ఈ దేశ ప్రజల వాణిగా మలిచే సాంప్రదాయాన్ని సృజించే మార్గం అన్వేషణ''లో అతను మరెవరికన్నానూ ఘనంగా విజయుడయ్యేడు. తన ముందున్న వివిధ భారతీయ, విదేశీయ, సాంప్రదాయ, ఆధునిక కళా రీతుల్ని ఆపోసనం పట్టేడు. జర్మన్ కాత్‌కొల్విట్జ్, మెక్సికన్ చిత్రకారులు, చైనీస్ - జపనీస్ ఉడ్‌కట్ రీతులు, గోయా రాజకీయ వ్యంగ్య చిత్రాలు, మనదేశపు మొఘల్, రాజ్‌పుట్ సూక్ష్మ చిత్ర రీతులు, బౌద్ధగుహా కుడ్య చిత్ర, శిల్పాలు, డేవిడ్‌లో ఆధునికత, అన్నీ అతనికి అధ్యయనం చేయదగినవే అయ్యాయి. వీటన్నింటినీ తను ప్రత్యక్షంగా చూసి ప్రేరణ పొంది బెంగాల్ జానపద కళారీతులతో సమన్వయించుకున్నాడు. తనదైన విశిష్ట మార్గాన్ని మలుచుకున్నాడు.

''గ్రాఫిక్స్'' జాబితాలోని లినోకట్, ఉడ్‌కట్ ప్రక్రియపై అధికారం సాధించాక దాన్ని ప్రజలను చైతన్యవంతులను చేసే కృషిలో పెద్ద ఎత్తున, క్రమబద్ధంగా శక్తివంతంగా వినియోగించిన తొలి చిత్రకారుడు చిత్తప్రసాద్. దీర్ఘకాలం ఈ విధానాన్నే అతను కొనసాగించాడు.

1946లో బొంబాయికి తరలివచ్చి, అనారోగ్యంతో 1978లో కలకత్తాకు తరలించబడి అదే సంవత్సరం నవంబర్ 13న మరణించేదాకా అక్కడే స్థిరపడిపోయేడు చిత్తప్రసాద్.

1949లో ప్రపంచ శాంతి సంఘం పిలుపుపై అనేక చిత్రాలను రూపొందించి శాంతి ఉద్యమానికి అంకితం చేసేడు.

1950లో ''కాలాఘర్'' పేర స్వయంగా ఒక పప్పెట్ థియేటర్‌ను నెలకొల్పేడు. ఆ ప్రాచీన కళారీతిని ఆధునిక అవసరాలకనుగుణంగా తీర్చిదిద్ది ఆ రంగంలో పునరుజ్జీవనోద్యమానికి ఆద్యుడయ్యేడు.

1946-48 మధ్య కాలంలో తెలుగు వారిని తెలుగు ప్రజల సాయుధ పోరాటాల్ని కళ్ళకు కడుతూ ఎన్నో చిత్రాలు వేసేడు. నిజాం వ్యతిరేక తెలంగాణా సాయుధ పోరాటాన్ని మరే చిత్రకారుని కన్నా శక్తివంతంగా ప్రజల కళ్ళకు కట్టేట్లు చేసేడు. అతని రేఖలతో తెలుగు రైతులు, మహిళలు అజరామరులయేరు.

మొదటి నుండి తనవైన ''నైతిక - రాజకీయ'' దృక్పథాలకు కట్టుబడి బ్రతికిన కళాకారుడు చిత్తప్రసాద్. తన కళను అమ్మి బ్రతకటానికతను నిక్కచ్చిగా నిరాకరిస్తూ వచ్చేడు. మనసొప్పని వాటిని వేయలేకపోయేడు. అందుకు దరిద్రాన్ని భరించవలసి వచ్చినా వెనుకంజ వేయలేదు.

1978లో కాలికిదెబ్బ తగిలి అనారోగ్యంపాలై కలకత్తాకు తరలించబడ్డాడు. నవంబర్13న అమరుడై పోయేడు.

చిత్త ప్రసాద్ ''గ్రాఫిక్స్'' వేల సంఖ్యలో చెల్లా చెదరై ఉన్నాయానాడు. మన దేశంలో వ్యక్తుల వద్ద తప్ప ఏ గ్యాలరీలోనూ భద్రపరచబడిలేవవి. ఈ అల్బంలోవన్నీ పాత పత్రికల నుండి సేకరించినవే. చెకొస్లొవేకియాలో, రష్యాలో, అమెరికాలో అతని చిత్రాలున్నాయి. ప్రపంచశాంతి సంఘ బహుమతినందుకున్న అతని జీవితాన్ని చూపే ఒక చిన్న డాక్యుమెంటరీ ఫిల్మ్ చెకొస్లొవేకియాలో ఉంది.

ఇవన్నీ త్వరలో మనకు అందుబాటులోకి తెచ్చుకుందాం. ప్రజాకళాకారుడు చిత్తప్రసాద్ సమగ్ర స్వరూపాన్ని దర్శిద్దాం. ఆ రోజు మరెంతో దూరంలోలేదు.

మనకోసం నిలబడి, మన కోసం తన కళతో పోరాడిన ధీరుడు చిత్త ప్రసాద్. అతన్ని మన మధ్య చిరశాశ్వతంగా నిలబెట్టుకుందాం.

**ఈ నెల 'మిసిమి' నాలుగు చిత్రాలు చిత్తప్రసాద్‌వి:**

***ముఖచిత్రం:*** వ్యవస్థకు వ్యతిరేకంగా సుదీర్ఘకాలం సాయుధపోరాటం కొనసాగించిన తెలంగాణా ప్రజల వీరగాథను గంగినేని వెంకటేశ్వరరావు ''ఉదయిని'' కావ్యంగా రాశారు. 1957లో వెలువడిన ఈ కావ్యానికి చిత్తప్రసాద్ ప్రత్యేకంగా వేసి పంపిన ఆరు అపురూప చిత్రాల్లో ఇదొకటి.

***రెండవ అట్టపై చిత్రం:*** తెలుగు రైతు తత్వాన్ని హావభావాలను, క్రోధావేశాలను అద్భుతంగా చూపే ఈ చిత్రం బాగా ప్రాచుర్యం పొందిన చిత్తప్రసాద్ బొమ్మల్లో ముఖ్యమైనది. చావో - బతుకో తేల్చుకోదలచుకున్న తెలుగు రైతు దృఢ నిశ్చయానికి ప్రతీకగా నిలిచే ఈ చిత్రంలో తెలంగాణా రైతాంగ పోరాటమంతా కళ్లకు కడుతుంది.

***మూడవ అట్టపై చిత్రం:*** అమాయక గ్రామీణుల్ని దౌర్జన్యంగా దోచుకోవడం అనేది దేశ మంతటా ఉన్నదే. గ్రామీణ రైతాంగాన్ని ప్రేమించే చిత్తప్రసాద్ ఆ దౌర్జన్యాలను చిత్రిస్తూ వేసిన బొమ్మల్లో ఇది ఒకటి. ప్రస్తుతం జెకొస్లొవేకియాలో ఉంది.

***నాలుగవ అట్టపై చిత్రం:*** 1944 మార్చి 12, 13వ తేదీలలో విజయవాడలో రాహుల్ సాంకృత్యాయన్ అధ్యక్షతన బ్రహ్మాండమైన రైతు మహాసభ జరిగింది. దేశం నలుమూలల నుండి కార్యకర్తలు, కళాకారులు కూడా హాజరయారీసభకు. ఆ సందర్భంగా చిత్తప్రసాద్ అక్కడికక్కడ ఎన్నో చిత్రాలు, స్కెచ్‌లు వేశారు. ఈ అనుబంధంతో ఆ తర్వాత జరిగిన రైతు పోరాటాలకు స్పందించారు. 1946లో తెలంగాణా రైతాంగ సాయుధపోరాటంపై అనేక చిత్రాలు రూపొందించారు. చిత్తప్రసాద్ తెలుగువాడేనేమోనని భ్రమకలిగేంతగా తెలుగు దనాన్నాబొమ్మల్లో చూపించారు. వాటిలో అతిముఖ్యమైన బొమ్మ ఇది.

డా. దేవరాజు మహారాజు రాసిన ప్రఖ్యాతవామపక్షీయ కళాకారుడు ''చిత్తప్రసాద్ ఆంతర్యంలో శ్రమైక జీవన సౌందర్యా''నికి సంబంధించిన వ్యాసానికి, కళాకారుడు, విమర్శకుడు చలసాని ప్రసాద్‌రావు కలం నుండి జాలువారి చిత్తప్రసాద్ పదవ వర్ధంతి సందర్భంగా రేఖా(ఫోరమ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్), హైదరాబాదు వారు ప్రచురించిన చిత్తప్రసాద్ ఆల్బం నుంచి కొన్ని చిత్రాలను అట్టలమీద ఇచ్చాము.

ఈ చిత్రాలను మాకు అందజేసిన ప్రముఖ కళాఖండ సేకర్తలు, కళాస్వాది శ్రీ కాండ్రేగుల నాగేశ్వరరావు గారికి కృతజ్ఞతలు - సం.

# నేటి వ్యవస్థలో పత్రికా స్వాతంత్ర్యం?

- వి.ఆర్. బొమ్మారెడ్డి

సమాజ శ్రేయస్సుకు, దేశాభివృద్ధికి పాటుపడే విధంగానూ, మానవుల్లో నైతిక విలువలను ఇనుమడింపచేసే విధంగానూ, అందుకు ప్రజల మనోభావాలను తీర్చిదిద్దడంలో పత్రికలు ముఖ్యమైన పాత్రను నిర్వహిస్తాయనే విషయంలో ఎలాంటి సందేహం లేదు. అందువలన ఆంధ్రప్రదేశ్‌లో ఇరవయ్యవ శతాబ్దిలో పత్రికల, తదితర మీడియా సంస్థల పరిమాణాలను సమీక్షించుకునే సందర్భంగా నేటి పత్రికల తీరుతెన్నులు, వాటి యాజమాన్య వ్యవస్థ, పత్రికల నిర్వహణలో ప్రధాన పాత్రను నిర్వహించే సంపాదకులు, ఇతర పాత్రికేయుల పాత్రను పరిశీలించుకొని, ఉన్న పరిమితుల్లో కర్తవ్యాలను నిర్దేశించుకోవడం అవసరం.

దేశ స్వాతంత్ర్యానికి ముందు మన పత్రికలు దేశభక్తి పూరితంగానూ, సంఘ సంస్కరణ దృష్టితోనూ ప్రధానంగా నిర్వహించబడుతూ వుండేవి. పత్రికల ప్రచురణను చేపట్టిన వారు వ్యాపార దృష్టితోనూ, లాభార్జన దృష్టితోనూ గాక సంఘ సేవా దృష్టితోనే ప్రధానంగా నడిపేవారు. తెలుగు వారిలో రాజకీయ చైతన్యాన్ని కలిగించి, వారిని దేశ స్వాతంత్ర్య ఉద్యమాల్లో పాల్గొనేందుకు ఉత్తేజపరిచేవారు. అలాగే సంఘ దురాచారాల నిర్మూలనకు, సాహిత్య సంస్కృతుల అభివృద్ధికి సాధనాలుగా తమ పత్రికలు ఉపయోగించే వారు. ఇందుకు తొలుత కందుకూరి వీరేశలింగం, చిలకమర్తి ప్రభృతులు జరిపిన కృషిని తార్కాణంగా పేర్కొనవచ్చు.

ఆ తరువాత కాలంలో కాశీనాథుని నాగేశ్వరరావు స్థాపించి నిర్వహించిన ఆంధ్రపత్రిక, ముట్నూరి కృష్ణారావు సంపాదకత్వంలో నడచిన కృష్ణాపత్రిక, హైదరాబాద్ నుండి సురవరం ప్రతాపరెడ్డి నేతృత్వంలో వెలువడిన గోల్కొండ పత్రిక, అడవి బాపిరాజు సంపాదకత్వంలో ప్రచురించబడిన మీజాన్ పత్రిక, కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యాన ప్రచురించిన ప్రజాశక్తి, విశాలాంధ్ర పత్రికలు ఇదే రకమైన ధోరణిలో దేశాభిమానాన్ని, సంఘసేవా దృష్టిని, సంఘ సంస్కరణ భావాలను ప్రజల్లో వ్యాపింపచేయడానికి అపారమైన కృషి చేశాయి.

## స్వాతంత్ర్యం అనంతరం

కాని మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత పత్రికలు క్రమేపీ వ్యాపార దృష్టిని ప్రధానంగా ఎంచుకొని అనన్య ప్రచారం గల దిన, వారపత్రికలు హెచ్చుగా బడా పెట్టుబడి దారుల అధీనంలోకి వెళ్ళాయి. అవి రాజకీయంగా స్వార్థపర వర్గాల ప్రయోజనాలకు అనుగుణంగా చాలావరకు వ్యవహరించడం మనం చూస్తున్నాం. ఆనాడు పత్రికా సంపాదకులు కొన్ని లక్ష్యాలను దృష్టిలో వుంచుకొని, స్వార్థపర వర్గాలతోనూ, అవకాశవాద రాజకీయ నాయకులతోనూ రాజీపడకుండా నిజాయితీగా సాధ్యమైనంత వరకు తమ ఉన్నతాశయాలకు అనుగుణంగా తమ నేతృత్వంలో వున్న పత్రికలను నడుపుతూ వుండేవారు. దేశ ప్రయోజనాలను, వార్తలను సరైన రీతిలో ఎంపికచేసి ప్రచురించే రీతిలోగాని ఒక పద్ధతిని అనుసరించేవారు. ఇందుకు యాజమాన్యాలు అడ్డుపడితే రాజీనామా చేసి

---

వి. ఆర్. బొమ్మారెడ్డి, ప్రజాశక్తి పూర్వ సంపాదకులు, విజయవాడ.

వైదొలగడానికి సిద్ధపడేవారు. కాని పరిస్థితులు ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. దినప్రతికలు బడా పెట్టుబడిదారుల ఆధీనంలోకి వెళ్ళడంతో సంపాదకులు నామమాత్రంగా తయారు కావాల్సి వచ్చింది. పాఠకుల మనోభావాలను సరైన రీతిలో తీర్చిదిద్దడంలో ఉపయోగపడే సంపాదకీయాలను రాయడంలో గాని, వార్తల ప్రచురణలో ఇచ్చే ప్రాధాన్యతలోగాని సంపాదకుని ఇష్టాయిష్టాలపై గాక యజమాని మనోభావాలకు అనుగుణంగా ప్రధానంగా జరుగుతున్నది. కొన్ని దినపత్రికల యజమానులే సంపాదకులుగా ప్రచురించుకునే అసాధారణ పరిస్థితి నేడు చూస్తున్నాం. సంపాదకుడు, ఇతర ముఖ్యమైన పాత్రికేయులు తమ రచనా పాటవాన్ని దాదాపు అమ్ముకోవలసిన దుస్థితి నేడు ఏర్పడిందంటే అతిశయోక్తి కాదు. ఒక్క మాటలో చెప్పాలంటే, యాజమాన్యం ఏ రాజకీయ పార్టీ లేదా ఆ పార్టీలోని ఏ గ్రూపుకు లేదా ఏ స్వార్థపర వర్గానికి చెందివుంటే, అందుకనుగుణంగా వార్తల ప్రచురణలో ప్రాధాన్యతనివ్వడం, అనుకూలంగా లేని వార్తను బుట్టదాఖలు చేయడమో లేదా వాటిని వక్రీకరించి ప్రచురించడమో ఇటీవల బాహాటంగా జరుగుతున్నది.

## 'హిందూ' పత్రిక ఉదంతం తెలుపుతున్న నగ్నసత్యం

ఇందుకు ఒకటి రెండు ఉదాహరణలు ఇస్తే ప్రభుత్వ, ప్రజా వ్యతిరేక చర్యలను దాని వెనుకనున్న పచ్చి స్వార్థపర వర్గాల హస్తాన్ని బట్టబయలు చేసే వార్తల ప్రచురణను బాహాటంగానూ, నిస్సిగ్గుగానే అడ్డుకునే ప్రయత్నాలను చూడవచ్చు.

దేశంలో విస్తృత ప్రచారం గల ఇంగ్లీషు దినపత్రికల్లో ఒకటైన 'ది హిందూ' యాజమాన్యానికీ, యాజమాన్యంలోనే ఒక భాగస్వామిగా ఉండి, దాని ఉప సంపాదకుడుగా వున్న ఎన్. రామ్‌కు మధ్య తలెత్తిన వివాదం నేటి బడా పత్రికల తీరుతెన్నులను, నగ్నంగా బయటపెడుతోంది.

'హిందూ' పత్రిక యాజమాన్యం ఒక కుటుంబానిది. ఆ కుటుంబంలో ఎన్. రామ్ ఒక ప్రధాన భాగస్వామి. ప్రముఖ పాత్రికేయుడేగాక, ఆ పత్రిక సహ సంపాదకుడు కూడా. ఆయన మరో రిపోర్టర్‌తో కలిసి సేకరించిన బోఫోర్స్ కుంభకోణం తెరవెనుక గల రహస్యాలను సేకరించి, 'హిందూ'లో వరుసగా ప్రచురించనారంభించాడు. ఆ కుంభకోణంలో ప్రధాని రాజీవ్‌గాంధీ పాత్ర గుట్టురట్టవుతోందని భయపడి ఢిల్లీలోని పాలక వర్గం కదిలి 'హిందూ' పత్రిక యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చింది. సూటిగా చెప్పాలంటే ఆ వ్యాసాల ప్రచురణ నిలుపుదల చేయకపోతే 'ఖబడ్దార్' మీ అంతు చూస్తామని బెదిరించింది. దానితో యాజమాన్యం రామ్‌ను ఒంటరివాడిని చేసి ఆ వ్యాసాల ప్రచురణ ఆపు చేయించాలిగింది. యాజమాన్యంలో భాగస్వామి అయినప్పటికీ రామ్ గత్యంతరం లేక తన సంపాదకత్వ పదవికి తిలోదకాలిచ్చి బయటపడవలసి వచ్చింది.

ఒకప్పుడు పచ్చి ఛాందస పత్రికగా వుండే ''హిందూ''ను రామ్ సహ సంపాదకత్వం స్వీకరించిన తరవాత దాని రూపురేఖలను పూర్తిగా మార్చివేసి ఆ పత్రికను అత్యంత ఆధునికంగా తీర్చిదిద్దిన ఖ్యాతి ఆయనకుంది. ఆయన కృషి ఫలితంగా హిందూ పత్రిక ఒక స్థాయిగల అగ్రశ్రేణి పత్రికగా ఈ తరం వారు ఇష్టపడే పత్రికగా దాన్ని రూపొందించి అటు ప్రచార, ఇటు వ్యాపారరీత్యా కూడా దాన్ని

శక్తిమంతంగా మలచి ముందుకు తెచ్చాడు. అంత చేయగలిగిన రామ్‌కు, తాను సహ సంపాదకుడుగానే గాక, భాగస్వామిగా కూడా వున్న ఆ పత్రికలో ఎంతో వ్యయ ప్రయాసలతో సేకరించిన బోఫోర్స్ కుంభకోణ రహస్యాలను ప్రచురించే అవకాశం లేకపోయిందంటే నేటి పత్రికలపై స్వార్థపర వర్గాల ఆధిపత్యం ఎంత ఉధృతంగా వున్నదో గ్రహించవచ్చు.

ఈ ఉదంతం చూసిన తరువాత కేవలం ఉద్యోగులుగా దేశంలోని వివిధ పత్రికల్లో పనిచేస్తున్న వేలాది జర్నలిస్టు మేధావుల సంగతేమిటి? వాళ్ళు తమ ''వృత్తి'' ఔన్నత్యాన్ని గురించి ఎన్ని గొప్పలు చెప్పుకున్నా ఆచరణలో మాత్రం వారంతా కలం కార్మికులు, కూలి మేధావులు మాత్రమేనని స్పష్టం కావడం లేదా?

## రామనాథ్ గోయెంకా విమర్శ

ఈ సందర్భంగా మరో ఉదాహరణ ఎమర్జన్సీ రోజుల్లో సైతం ప్రభుత్వ నిర్బంధాలను ధైర్యంగా ఎదుర్కొన్న 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' గ్రూపు పత్రికల అధినేత రామనాథ్ గోయెంకా కొంతకాలం క్రితం ''ఆన్ లుకర్'' అనే పత్రికకు ఇంటర్వ్యూ ఇస్తూ తనకు జర్నలిస్టులపై ఏ మాత్రం గౌరవం లేదని తేగేసి చెప్పాడు. 'వాళ్ళ ఖరీదు రెండు పెగ్గుల విస్కీ లేదా ఒక అరబుడ్డి స్కాచ్' అని వ్యంగ్యంగా పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యకు నిరసనగా ఆయన పత్రికల్లో పనిచేసే వెయ్యిమందికి పైగా వున్న జర్నలిస్టులలో ఒక్కరైనా నోరు మెదపకపోవడం గమనార్హం.

నేటి పత్రికల ధోరణి ఇలా వున్నప్పుడు అందులో పనిచేసే జర్నలిస్టులు, మేధావులు ఏమి చేయగలరు? ఆ పరుగులో నెగ్గిననాడే పత్రికలకు కావలసిన వాడవుతాడు. కనుక మన జర్నలిస్టు మేధావులను నిందించడం అన్యాయం. తమ బ్రతుకుదెరువుకోసం వాళ్ళు కేవలం ఆలోచించే శక్తిగల, రాసే నేర్పుగల కాస్త ఖరీదైన గుమస్తాలుగా మిగిలిపోవలసి వస్తున్న దుస్థితిలో పడుతున్నారు.

'ఉక్కుపాదం' ( ఐరన్ హీల్) అనే నవలలో ప్రఖ్యాత రచయిత జాన్ లండన్ మేధావి వర్గాన్ని గురించి ఏనాడో అన్న మాటలను చూడండి.

'మేధావి వర్గం అనేది ధనిక స్వామ్యానికి ఊడిగం చేయడం ద్వారానే తన ఉనికిని కాపాడుకోగలుగుతుంది. వారి ఉద్యోగ ధర్మం ఏమిటి? ధనిక వర్గానికి అపకారం చేయని భావాలనో లేదా దానిని కీర్తించే భావాలనో ప్రచారం చేయడమే. ఇందుకు విరుద్ధంగా వారు ఏనాడైనా ప్రవర్తించారో వారి ఉద్యోగం ఊడిందన్నమాట.''

ఈ సందర్భంగా మన వేమన ఏనాడో చెప్పిన విషయం గమనార్హం.

కులం గల్గువాడు గుణం గల్గువాడు
విద్యచేత విర్రవీగువాడు
పసిడి గల్గువాని బానిస కొడుకులు
విశ్వదాభిరామ వినురవేమ.

మధ్య యుగాలనాడే మన వేమన ఇలాంటి వ్యాఖ్య చేశాడంటే ఆయనకుగల దూరదృష్టి ఆశ్చర్యపరిచేదిగా లేదా?

అయితే పెట్టుబడిదారుల యాజమాన్యాన గల పత్రికలు, అందులో పనిచేసే అభ్యుదయ వామపక్ష వాదులనుకునే సంపాదకులు, వ్యాఖ్యాతలు స్వార్థపర వర్గాలకు గిట్టకపోయినా తప్పనిసరై కొంతమంది వామపక్షనాయకులను ఆదర్శవంతమైన ప్రజానాయకులని పి సుందరయ్య, నంబూద్రిపాద్‌గార్లనో, లేదా పాతికేండ్లపాటు వరుసగా ముఖ్యమంత్రి పదవిని నిర్వహించి రికార్డు సృష్టించిన, కార్యదక్షత గల నిజాయితీ పరుడైన పాలనాధ్యక్షుడని జ్యోతిబసునో, జనసామాన్యంకోసం నిలబడి పోరాడి, త్యాగాలు చేసిన వారనో ఎప్పుడైనా ప్రశంసించవచ్చు. కాని వారు అంకితమైన సిద్ధాంతాలను గాని, ఉద్యమాలను గాని అభిమానించుతూ ఏమాత్రం రాయలేరు. వారిపట్ల పాఠకులలో గౌరవమూ, అభిమానం, ఆసక్తి వుంది గనుక దాన్ని తృప్తిపరిస్తే తప్ప పత్రిక నిలవదు గనుక. ''పత్రికాధర్మం'' గానూ 'వార్త విలువగానూ' చెప్పి ఆయా విషయాలను కూడా ప్రముఖంగా అప్పుడప్పుడు వీలునుబట్టి పత్రికలు ప్రచురించడం కద్దు.

ఈనాటి బడా పత్రికల నుండి మనం ఆశించగలది ఇది మాత్రమే. జర్నలిస్టులకు, మేధావులకు రాసే అవకాశం ఉన్నది కూడా ఇంతవరకే అంటే సోదర పాత్రికేయులు మన్నించగలరు.

## ఉన్న పరిస్థితుల్లోనే జర్నలిస్టుల పాత్ర

అందువలన మన పాత్రికేయుల ఉద్యమానికి పితామహుడుగా ఎంచబడుతున్న ఎం. చలపతిరావు హితవు చెప్పినట్లు జర్నలిస్టులు తమ సంఘాల ద్వారా తమ జీతభత్యాల కోసం, పని పరిస్థితుల మెరుగుదల కోసమే గాక ప్రజల పరిస్థితులను మెరుగుపరచడానికి, ప్రజాస్వామ్య రక్షణకోసం, దేశాభి వృద్ధికి నేడు వున్న పరిమిత పరిస్థితులలోనే సాధ్యమైనంత వరకు కృషిచేయాలని ఉద్బోధించారు.

ఈ సందర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం జర్నలిజం అధ్యాపకులైన డాక్టర్ నాగేశ్వర్ మొన్నీ మధ్య జరిగిన సదస్సులో చేసిన సూచనలు పాత్రికేయులు గమనించదగినవిగా ఉన్నాయి. నేడు బడా పెట్టుబడిదారుల ఉక్కు చట్రంలో దినపత్రికలు ఉన్నప్పటికీ నిజాయితీగల పాత్రికేయులు కొంతగా నైనా దేశానికి, సమాజానికి ఉపయోగపడే వార్తలను ప్రచురించే అవకాశం లేకపోలేదని ఆయన చెప్పారు. దేశాన్ని, ప్రజలను నిత్యం వేధించే సమస్యలకు, వాటి పరిష్కారం కోసం జరిగే యత్నాలకు, సూచనలకు, అందుకోసం కృషి సలిపే ప్రజా ఉద్యమాలకు తాము ఎడిట్ చేసే పత్రికల్లో చోటు చేసుకునేలా యత్నించవచ్చు. యజమానుల రాజకీయ ప్రయోజనాలకు పెద్దగా ఇబ్బందిలేని వార్తలను ప్రచురించి సమాజానికి ఉపయోగపడవచ్చు. ఉదాహరణకు నిరుద్యోగ సమస్య. స్త్రీలపై జరిగే అత్యాచారాలు, బలహీనవర్గాలపై జరిగే దాడులు, అధికారంలో వున్న మంత్రులు గాక, ప్రభుత్వ ఉద్యోగుల ఆశ్రిత పక్షపాతం, పరిపాలనా వ్యవస్థలోని అవకతవకలు, లంచగొండితనం మొదలగు సమస్యలకు సంబంధించిన వార్తలను సేకరించి ప్రచురించవచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే చౌకబారు వార్తలకు అవకాశం ఇవ్వకుండా నేటి ప్రజా జీవితాన్ని, ప్రజలను వేధించుతున్న సమస్యలను

యథార్థంగా చిత్రించే వార్తలు, వ్యాసాలు, వ్యాఖ్యలు అలాగే బూటకపు కబుర్లు గాక, సంఘటిత ప్రజా ఉద్యమాలకు, నిర్దిష్టమైన ఆర్థిక, సాంఘిక, రాజకీయ విధానాలను వివరించే ప్రకటనలకు, దేశం ఎదుర్కొనే క్లిష్ట సమస్యల పరిష్కారం చూపే సూచనలకు సంబంధించిన వార్తలు, వ్యాసాలు పత్రికల్లో ఎక్కువ చోటు చేసుకునేలా పాత్రికేయులు తమ శక్తియుక్తులను ఉపయోగించడానికి యత్నించాలి. అప్పుడే మన పాత్రికేయులు తమ వృత్తిధర్మాన్ని కొంతవరకైనా నిర్వర్తించిన వారమవుతాం. అప్పుడే మన పత్రికా వృత్తి సార్థకం కాగలదు.

## పత్రికా యాజమాన్యం

చివరలో పత్రికా యాజమాన్యం గురించి సూచనలు

ఈనాడు అన్న్య ప్రచారం గల దినపత్రికలు, కొన్ని వారపత్రికలు చాలావరకు బడా పెట్టుబడిదారుల చేతుల్లో వుండి. స్వార్థపర శక్తులకు, వాటికి అండగా నిలబడే ప్రభుత్వాలకు ఏదో విధంగా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఉపయోగపడే విషయం మనకు తెలిసిందే. అందువలన నేడున్న ఫ్యూడల్ పెట్టుబడిదారీ వ్యవస్థలో పూర్తిగా పత్రికా స్వాతంత్ర్యం అసాధ్యం కనుక పత్రికా యాజమాన్యం ఎలా వుండాలన్న సమస్య ముందుకొచ్చింది.

పాత్రికేయుల ఉద్యమానికి పితామహుడనదగిన ఎం. చలపతిరావు అభిప్రాయాలతో మనం చాలావరకు ఏకీభవించవచ్చు.

అవి ఇవి: కొన్ని నిర్దిష్టమైన లక్ష్యాలుగల ట్రస్టుల యాజమాన్యాలలో గాని, బాధ్యతగల రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల యాజమాన్యంలో గాని పత్రికలు వుంటే అవి ఆయా సంస్థలకు, వాటి సభ్యులకు జవాబుదారీగా వుంటాయి. నీతి, నియమాలతో నిమిత్తంలేని పెట్టుబడిదారీ యాజమాన్యాల కంటే నిర్దిష్టమైన లక్ష్యాలను, విధానాలను కలిగి వుండే రాజకీయ పార్టీలు, సాంఘిక సంస్థలు, ట్రేడ్ యూనియన్లు, సాంఘిక సంస్థలు, ఇతర ప్రజాహిత సంస్థల అధీనంలో పత్రికలు నిర్వహించబడటాన్ని తాను ఆహ్వానించుతానన్న ఎం. చలపతిరావు అభిప్రాయాలను పరిశీలించడం అవసరం. నేటి ఫ్యూడల్ పెట్టుబడిదారీ వ్యవస్థలో పత్రికా స్వాతంత్ర్యాన్ని కొంతవరకైనా నిలుపుకోవడానికి ఇంతకంటే మరో మార్గం లేదనిపిస్తున్నది. అలాంటి పత్రికలకు కొంతవరకైనా జవాబుదారితనం వుంటుంది.

## కొసమెరుపు

''పాలక వర్గం యొక్క భావాలే ప్రతి శకంలోనూ ప్రబలంగా వుంటాయి. అంటే అర్థం సంఘాన్ని భౌతికంగా పాలించే వర్గమే మానసికంగా కూడా పరిపాలించుతుందనే. భౌతిక విషయాలకు సంబంధించిన ఉత్పత్తి సాధనాలు ఏ వర్గాధిపత్యంలో వుంటాయో ఆ వర్గం చేతుల్లోనే మానసిక విలువలకు చెందిన ఉత్పత్తి సాధనాలు కూడా ఉంటాయి.''

1872లో కారల్‌మార్క్స్ రాసిన ఈ మాటలను దృష్టిలో వుంచుకుంటే అర్థం కానిదేమీ వుండదు.

# సోమర్‌సెట్‌మామ్ - అనుభవాలు, అభిప్రాయాలు

(ది సమ్మింగ్ అప్ ఆధారంగా)

- బి.వి. రామిరెడ్డి

సోమర్‌సెట్ మామ్ రచించిన పుస్తకం - 'ది సమ్మింగ్ అప్' - ఒక కళాకారుడు, రచయిత, విస్తృత యాత్రికుడు జీవితపు మూడో యామం చివర నించుని చేసుకున్న సింహావలోకనం, అందులోంచి నిగ్గుతేల్చుకున్న తన రచన, జీవితం గురించిన సారాంశం. అందుకే మామ్ దీన్ని 'ఎ బుక్ ఆఫ్ రిఫ్లెక్షన్స్' అన్నాడు. 74 అధ్యయాల, 203 పేజీల ఈ పుస్తకం రచయితగా, వ్యక్తిగా, ఆలోచనాపరుడిగా మామ్‌ని మనకు అవగాహనలోకి తెస్తుంది. బాల్య, యౌవన, కౌమారాల్లో మామ్‌ని ప్రభావితం చేసిన విషయాలు; ఆయన వ్యక్తిత్వంలోను, రచయితగా ఆయన నమ్మకాల్లోను, ఆలోచనా ధోరణిలోను వచ్చిన మార్పుల్ని మనం ఈ పుస్తకంలోంచి తెలుసుకోవొచ్చు. మామ్ అన్నట్టు ఇది ఆత్మ కథనం కాదు, అవలోకనాభరితం.

మామ్ జీవితంలో, ముఖ్యంగా బాల్యంలోని గాఢమైన సంఘటన - ఎనిమిదేళ్ళ వయసులో తల్లి మరణం. జీవితాంతం మామ్ వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేసిన సంఘటన ఇది. మామ్ ప్రసిద్ధ నవల 'ఆఫ్ హ్యూమన్ బాండేజ్' ఇందుకు సాక్ష్యం. జీవిత చరమాంకం దాకా మామ్ జీవిత నాటకంలో ప్రధాన పాత్ర వహించిన మరొక విషయం అతనిలోని లోపం - నత్తి. వ్యక్తిగా, తన చుట్టూ వున్న సమాజంలో మామ్ ఎవరికీ అత్యంత సన్నిహితుడు కాలేకపోవడానికి కారణం అదే. మామ్ జీవితమంతా ఒంటరి బాటసారిగా ప్రపంచాన్వేషణ చేసుకుంటూ వెళ్ళిపోవడానికి పై రెండూ కారణమనిపిస్తుంది. మామ్‌ని వదలని మరో సహచరి, వంశపారంపర్యంగా సంక్రమించిన టి.బి. ఈ మూడూ వ్యక్తిగా, రచయితగా మామ్‌ని ఏకాంతపు బహుదూరపు బాటసారిని చేశాయి.

మానవ సమూహాల్లోని సామూహిక వ్యక్తిత్వాన్నీ, వ్యక్తుల్నీ పరిశీలించడంలో మామ్‌కున్న సమగ్ర దృష్టి అద్భుతం. మామ్ బహుభాషాకోవిదుడు. ఆయనకు ఆంగ్లం, ఫ్రెంచి, జర్మన్, స్పానిష్, ఇటాలియన్, లాటిన్ భాషల్లో గొప్ప పాండిత్యం వుంది. ఆంగ్ల భాషా స్వభావపు లోతుపాతుల్ని సున్నితంగా, సునిశితంగా పరిశీలించిన కొద్దిమంది ఆధునిక రచయితలలో మామ్ ఒకడు. అమెరికన్ ఇంగ్లీషుకు, బ్రిటీషు ఇంగ్లీషుకూ భేదాన్ని మామ్ చెప్పినంత విపులంగా ఎవరూ చెప్పలేదేమో! ''మన ఆంగ్ల రచయితలు సహా అమెరికన్ రచయితల నుండి నేర్చుకోవలసిందెంతో వుంది. అమెరికన్ రచన కింగ్ జేమ్స్ బైబిలు నిరంకుశత్వాన్నించి తప్పించుకుంది. అమెరికన్ రచయితలు. ఆంగ్ల సంస్కృతిలో భాగమైన రచనా విధానాన్ని సృజించిన పాత రచయితల వల్ల ప్రభావితులు కాలేదు.''

యౌవనంలో వృత్తిపరంగా, లండన్‌లోని సెయింట్‌థామస్ హాస్పటల్‌లో శిక్షణ పొందడం వ్యక్తుల వ్యక్తిత్వాల్లోని అంతరాళాల రహస్యాల్లోకి సునిశితంగా చూడడం నేర్పింది. మానవ స్వభావాలను అంచనా వేయడం మామ్ అక్కడే నేర్చుకున్నాడు. అయినా మానవ స్వభావాన్ని సంపూర్ణంగా అవగాహన చేసుకోవడమూ, అంచనా వేయడమూ అసాధ్యం అంటాడు మామ్. మనం పూర్తిగా అర్థం చేసుకున్నాం

---

బి.వి. రామిరెడ్డి, సిద్ధార్థా ఆర్ట్స్ & సైన్స్ కళాశాలలో ఆంగ్లోపన్యాసకులుగా పనిచేస్తున్నారు, విజయవాడ.

అనుకున్న మనుషులే ఒక్కో సందర్భంలో వాళ్ళు అలా ఎందుకు చేశారో అర్థం కాదు. 'నాకు సహజంగానే మనుషుల్లో నమ్మకం లేదు. అయితే 'సెన్సాఫ్ హ్యూమర్' ఉన్నవాళ్ళు మనుషుల్లోని విలక్షణాలను చూసి ఆనందించగలుగుతారు. సెయింట్స్‌ని వాళ్ళు అర్థం చేసుకోలేరు, గుర్తించలేరు. హ్యూమర్ మనిషికి ఓర్పును నేర్పుతుంది. మనుషుల్ని నేను నాలో పోల్చుకొంచి చూసి వుంటాను. మానవ సమూహం అనంత వైచిత్రీమయం. మానవ శరీర శాస్త్రంలో ఏకత్వంలేనట్లే మానవ స్వభావాల్లోనూ లేదు. రచయిత ముఖ్యంగా తెలుసుకోవలసిన విషయం ఇది. కళాకారుడు విలక్షణమైన వ్యక్తి. సంతోషంతో పొంగిపోయే మానవ సమూహాలమధ్య నేనెప్పుడూ ఒంటరివాణ్ణే' అంటాడు మామ్. మామ్‌కి సానుభూతి తక్కువ.

'రచయిత ఎప్పుడూ తన అంతర్ ప్రపంచంలోకి ఇతరుల్ని రానివ్వకూడదు. రచయితలంటే మామూలు మనుషులకి ఒక అందమైన భ్రమ ఉంటుంది. అందుకే రచయితను గురించిన నగ్న సత్యాల్ని వాళ్ళు భరించలేరు. ఆంటోనీ ట్రాలోప్ సాహిత్యాన్ని ముప్పయి సంవత్సరాలపాటు పాఠకులు చదవడం మానేశారు కారణం, అతడు తన రచనకి మంచి ధర పలికినపుడే రచన చేశానని చెప్పుకోవడమే.'

'సంగీత ప్రపంచంలో సహజ విద్వాంసులూ, శ్రమించి విద్వత్తు సాధించుకున్నవారూ ఉంటారు. సహజ విద్వాంసులు వాళ్ళ ప్రత్యేక కళ వల్ల శ్రోతల్ని రంజింపజేస్తారు. వాళ్ళేం చేసినా శ్రోతలు మంచిగానే తీసుకుంటారు. మామూలు విద్వాంసులు అలా చెల్లుబాటు కారు. రచయితలూ అంతే' మామ్ తనని రెండో తరగతికి చెందిన రచయితనని చెప్పుకున్నాడు.

యౌవనంలో, మనం సాహిత్య పఠనం ప్రారంభించే రోజుల్లో, పుస్తక పఠనం విషయంలో మనకు సరైన సలహా ఇవ్వగలిగేవాళ్ళు లభించడం అదృష్టం. అలాంటివాళ్ళు దొరకనట్లయితే మన జీవితంలో సమయం శ్రమ వృథా అవుతాయి. తనకు అలాంటి వాళ్ళు దొరక్కపోవడం తన దురదృష్టం అంటాడు మామ్.

జీవితంలో ఒక దశలో విపరీతంగా పుస్తకాలు చదివి జ్ఞానాన్ని సంపాయించుకోవాలనే తాపత్రయం వుంటుంది. ప్రరంభదశలో మామ్ అలాంటి ప్రయత్నం చేసినా, తరువాత పుస్తకాల జ్ఞానంకంటే జీవితం గొప్పదని గ్రహించి, పుస్తకాల్ని ప్రక్కన పెట్టేశాడు. ఒక పుస్తకాన్నెప్పుడూ మన వ్యక్తిత్వానికి పనికి వచ్చే అర్థం కోసమే చదవాలి. కొందరు యువ రచయితలు తాము ముఖ్యంగా చదువవలసిన పుస్తకాలను గురించి ప్రసిద్ధులైన రచయితలను అడుగుతారు, కాని చదవరు. పాత రచనల్ని చదవడం వల్ల మన రచనల్ని వాటితో పోల్చుకుని వాటి విలువను నిర్ణయించుకోవడానికి వీలవుతుంది. కొందరు యువ రచయితలు ఒకటి రెండు మంచి రచనలు చేసి చతికిలబడతారు.

లండన్‌లో నేను ఎప్పుడూ స్వంత ఇంటిలో వున్న అనుభూతిని పొందలేకపోయాను. అవకాశం దొరికినపుడల్లా, ఇటలీ, జెనీవా, పారిస్‌లలో పర్యటించి వస్తుండేవాణ్ణి.

నాటక కర్తలు చాలమంది నాటకశాలల్ని వదల్లేరు. వాళ్ళకి అదే ప్రపంచంగా వుంటుంది. నాకు అలాంటి పిచ్చిలేదు. నేను నాటక శాలకు వెళ్ళి, నా నాటకాన్ని ఆడుతుంటే చూసినా, పదిమందిలో కూర్చుని నన్ను నేను మరచిపోయేవాణ్ణి.

నటుడికి ఓర్పుకావాలి. లేకపోతే వైవిధ్యభరితమైన పాత్రల్ని చేయలేడు. నటనను వృత్తిగా స్వీకరించిన వాళ్ళకు, దానికే తమను తాము అర్పించుకున్న వాళ్ళకు ఆ విషయం తెలుసు. అందుకే వాళ్ళు ప్రతి నాటకాన్ని, పాత్రల్ని జాగ్రత్తగా పరిశీలిస్తుంటారు. నాటక రచయితగా వెలుగు చూడాలని గట్టి ప్రయత్నంతో ఎన్నో ఎక్స్‌పెరిమెంటల్‌నాటకాలు వ్రాశాను. కొన్నింటిని ప్రజలు బాగానే తీసుకున్నారు. నేను బాగా వ్రాసిన నాటకాలు కొన్ని ప్రేక్షకులకు నచ్చలేదు. కారణాలనేకం. మొదటి ప్రపంచ యుద్ధం వల్ల వచ్చిన ఖాళీ సమయాలు నాకు నాటక రచనకు బాగా ఉపయోగపడ్డాయి. నా నాటకాలు ఎక్కువగా కామెడీలు. నాటక రచయితగా ప్రసిద్ధుడవ్వాలంటే ప్రధానంగా ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకోవలసి వుంటుంది. నాటకంలో పద్యం నాటకీయతకు దోహదపడుతుంది. కాని వాస్తవికవాదం దాన్ని మార్చివేసింది. ఏ నాటకం అయినా విజయం సాధించాలంటే రచన, ప్రొడక్షన్, నటన - ఈ మూడింటి సమన్వయం అవసరం. అందుకే మనసులో ఇంకా కొన్న నాటకాలకు సంబంధించిన ప్లాట్లు ఉన్నా, నాటక రచనను ప్రక్కన పెట్టేశాను.

నా మొదటి నవల ''లిజా ఆఫ్ లాంబెత్''. దీనిని 'ఫిషర్ అన్‌విన్' పబ్లిషర్లు వెంటనే ప్రచురించారు. రచనే వృత్తిగా జీవించాలనే ఉద్దేశ్యంతో సెయింట్ థామస్ హాస్పటల్‌లో వచ్చిన ఉద్యోగావకాశాన్ని వదులుకున్నాను. నా మొదటి రచన మీద వచ్చిన రాయల్టీ నాకు ధైర్యాన్నిచ్చింది. విపరీతంగా పుస్తకాలు చదివాను. మపాసా నన్ను గాఢంగా ప్రభావితం చేశాడు. నా మొదటి నవలలో సెయింట్ థామస్ హాస్పటల్‌లో నేను చూసిన వ్యక్తుల్నే పాత్రలుగా చేసి అతిశయోక్తితో వర్ణించాను. మురికివాడల మీద ఒక పెద్ద నవల వ్రాయమని 'ఫిషర్ అన్‌విన్' వారు నన్ను వొత్తిడి చేశారు.

తరవాత నేను వ్రాసిన మూడు నవలల్లో 'మెస్సర్స్ క్రాడ్డాక్' ఒకటి. మిగిలిన రెండూ నా నాటకాలకు నవలీకరణలు. ఆర్థిక సమస్యలు లేకుండా, సుఖంగా జీవించడానికి, తలెత్తుకు బ్రతకడానికి, మూడు లేక నాలుగువందల పౌండ్ల ఆదాయం తెచ్చిపెట్టగల పుస్తకాన్ని వ్రాయాలని నిర్ణయించుకున్నాను, రచనా వృత్తిలో స్థిరపడ్డాను.

మపాసా తన రచనలనన్నింటిని ఫ్లాబర్ట్‌కు ఇచ్చేవాడట, సరిదిద్దడం కోసం. అలా యిచ్చిన అతని ప్రపంచ ప్రసిద్ధమైన కథ Boule de Suif ను చాలా సంవత్సరాల తరువాత గాని ఫ్లాబర్ట్ ప్రచురణకు పంపలేదు. మపాసాకు ప్రభుత్వోద్యోగం ఉంది కాబట్టి సరిపోయింది. మరి రచనను వృత్తిగా చేసుకున్నవాళ్ళకు అది ఎలా సాధ్యమౌతుంది? ఫ్లాబర్ట్‌లాంటి రచయిత సలహాలు దొరకడం మపాసా అదృష్టం. నా మొదటి నవలకు గుర్తింపు రాకపోతే వైద్య వృత్తిలో స్థిరపడి వుండేవాణ్ణి.

రచయితగా రకరకాల ప్రయోగాలు ప్రారంభించాను. నేను వ్రాసిన, ఒక దానితో ఒకటి సంబంధం వున్న నాలుగైదు కథల్ని కలిపి ఒక నవలగా తయారు చేశాను. దానికి 'ది మెర్రీగో రౌండ్' అని పేరు పెట్టాను. దీనిలో ఆత్మకథా రచనా విధానాన్ని ఉపయోగించాను.

అందరు రచయితల లాగా కాక నేను రచయితగా నెమ్మదిగా ఎదిగానని పిస్తుంది. ఇంతలో నాటక రచయితగా నాకు హఠాత్తుగా కీర్తి ప్రతిష్టలు వచ్చాయి. వాటి మీద వచ్చిన డబ్బుతో 'మేఫెయిర్'లో ఒక యిల్లు కొనుక్కున్నాను. రచయితలు ఊహా జీవులు. లగ్జరీ అనేది కళాకారుడికి ఒక మార్పు లాంటిది. అందుకే కొందరు ప్రసిద్ధ రచయితలు, కవులు భోగాల్లో జీవించారు. నాకు సంపదతో ఎటాచ్‌మెంట్ లేదు. వేటినైనా వదులుకోగలను, అతి సామాన్యంగా జీవించగలను. డబ్బు విషయంలో జాగ్రత్తగా వుండేవాణ్ణి.

డాక్టర్, లాయర్ వృత్తిలాగ రచనకూడా ఒక వృత్తే. అయితే మిగతా వృత్తుల్లో లేని స్వేచ్ఛ ఈ వృత్తిలో వుంటుంది. రచయితలు స్వేచ్ఛాజీవులు. కాబట్టి వాళ్ళు తమ సాటి మనుషులమీద సానుభూతి చూపాలి గాని, హేళన చెయ్యకూడదు. కేవలం రచనా వృత్తిమీదే జీవించడం సులభ సాధ్యం కాదు. అందుకే కొందరు ఏదో ఒక ఉద్యోగం చేస్తూ రచనా ప్రవృత్తిని నిర్వర్తించుకున్నారు. ఆలోచిస్తూ, అనుభూతి చెందుతూ, పరిశీలిస్తూ, చదువుతూ కూడా రచయిత రచనా వ్యాసంగంలో వున్నట్టే. కొందరికి రచన అంటే కాలక్షేపం. రచనలోనే జీవికనూ, జీవన ప్రవృత్తినీ వెదుక్కునే వాళ్ళెన్నో సమస్యల్ని ఎదుర్కోవలసి వుంటుంది.

ప్రవృత్తి, వృత్తి రచయితలకు మూడ్, వ్రాయాలనే బాధ్యత అతని చెప్పు చేతల్లో వుంటాయి. అతని ప్రతి రచనా ఆత్మావిష్కార సాహసం. మాటలు అతని అవసరానికి అమరుతాయి. రచన అతని ధ్యాన ప్రపంచపు అంతర్ భాగాన్నీ, భారాన్నీ ఆవిష్కరిస్తుంది. రచయిత తన రచనతో సంతృప్తిపడలేడు, పైగా సందేహ పడతాడు. అందుకే రచయితకు పొగడ్త అవసరం. అదే అతని బలహీనత కూడా. కళాకారుడు పొగడ్తలనీ తెగడ్తలనీ పట్టించుకోకూడదు. ఎందుకంటే రచన తనకు సంబంధించింది. రచన కళాకారుడి ఆత్మ స్వేచ్ఛీకరణ. రచయితలు కూడ ఒక రచనని ఆవిష్కరించేప్పుడు పురిటినొప్పుల్లాంటి బాధా సంచయాన్ని పొందుతారు. పాఠకుడికి రచయిత యిచ్చే సందేశం తన జీవితంలోని, తనలోని భాగమే. షేక్స్పియర్, స్కాట్, బాల్జాక్ లాంటివారు రాబోయే యుగాలకోసం వ్రాశారనిపిస్తుంది. రచయిత జీవితం విషాదం. అతడు తన లోపాలను, దుఃఖాలను, బాధలను, పొరపాట్లను, జబ్బులను, శారీరక వక్రతలను, అసంతృప్త ప్రేమను అన్నింటినీ తన రచనతో జయిస్తాడు. ఆ విధంగా కళాకారుడు మాత్రమే స్వేచ్ఛాజీవి. అందుకే ప్రపంచం అతణ్ణి అనుమానిస్తుంది. అతడు తన విలువల్ని తానే నిర్ణయించుకుంటాడు. అతని స్వేచ్ఛ మామూలు మనుషుల విలువలకు అతీతమైనది. అతణ్ణి తమ విలువలతో నిబద్ధించడం మామూలు మనుషులకు అసాధ్యం.

నేను మెడికోగా ప్రాక్టీసు పొందుతున్న రోజుల్లో ఒక నవల వ్రాసి 'ఫిషర్ అన్విన్' అనే ప్రచురణ సంస్థకు పంపాను. వారు తిరస్కరించారు. దానికి మొదట ''బ్యూటీ ఫ్రమ్ యాషెస్'' అని పేరు

పెట్టాను. తరవాత దాన్ని ''ఆఫ్ హ్యూమన్ బాండేజ్''గా మార్చాను. ఇది స్వీయ చరిత్ర కాదు; స్వీయ చరిత్రాత్మక నవల. ఆ రచనతో అప్పటి వరకు నేను జీవించిన జీవితానుభవాల, అనుభూతుల వొత్తిడి నుండి బయట పడ్డాను.

పాతతో విసుగెత్తి కొత్త అనుభవాలకోసం అన్వేషింప సాగాను. కేబినెట్ మంత్రిగా వున్న ఓ మిత్రుడి సాయంతో అంబులెన్స్ యూనిట్‌లో చేరాను. తరవాత ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్‌లో చేరాను. ఈ రెండు వృత్తులూ చేపట్టడానికి దేశ భక్తికంటే ఆ వృత్తుల్లోని విస్తృత ప్రయాణాలు, ఆ ప్రయాణాల ఆనందం కారణమనుకుంటాను. రకరకాల మనుషుల్ని చూడడం, వారికి సంబంధించిన అనుభూతుల్ని హృదయంలో పదిలపరుచుకోవడం నాకు ఆనందాన్నిచ్చాయి. ఇంటెలిజెన్స్ వృత్తిలోని రొమాన్సు, రిడిక్యులస్ నాకు నచ్చాయి. నా ఆరోగ్యం దిగజారడంతో, ఒక సంవత్సరం స్విట్జర్లాండులో వుండి, ఉద్యోగాన్ని వదిలేసి అమెరికా వెళ్ళిపోయాను. హెర్మన్ మెల్‌విల్ల్, పియర్రెలోటి ద్వీపాలకు వెళ్ళాను. అక్కడి సుందరతరమైన ప్రకృతిని చూడడానికి వెళ్ళలేదు, అక్కడ నివసించే విచిత్రమైన మనుషుల్ని, వారి జీవన విధానాన్ని చూసి ఆనందించాను. వారిలో చాలమందికి సంస్కారం అంటే ఏమిటో తెలియదు. వారి జీవన విధానం విలక్షణమైనది. వారి జీవన విధానంలో గొప్ప శక్తి వున్నదని గ్రహించాను. సంస్కారులైన మనుషులు కొన్ని నియమాలు పెట్టుకుని బతుకుతారు. సంస్కృతి అనేది ఒక ముసుగు.

ఈ ద్వీపాల్లోని మనుషులు నగ్నంగా జీవిస్తున్నారు. వాళ్ళ విచిత్ర ప్రవృత్తితో ఏ సంస్కారమూ లేకుండా వృద్ధిపొందే అవకాశం వీళ్ళకి కలిగింది. వీళ్ళు మానవ ప్రకృతికి సంబంధించిన ప్రాథమిక లక్షణాలకు చాలాదగ్గరగా వున్నారని గ్రహించాను. వీళ్ళు సెయింట్ థామస్ హాస్పటల్‌లో నేను చూసిన మనుషులకంటే విలక్షణమైన వాళ్ళు, వీరిని చూసిన అనుభూతుల్లోంచి, అనుభవాల్లోంచి కథల్ని సృజించసాగాను.

అమెరికాకు తిరిగి వచ్చాక పెట్రోగ్రాడ్ వెళ్ళే అవకాశం వచ్చింది. అప్పటికి నేను టి.బి.తో బాధపడుతున్నాను. అయినా, టాల్‌స్టాయ్, డోస్టవస్కీ, చెహోవ్‌ల దేశాన్ని దర్శించాలనే కుతూహలంతో అక్కడికి వెళ్ళేందుకు నిర్ణయించుకున్నాను. ప్రైవేటు ఏజెంట్‌గా, రష్యాని యుద్ధంలో ఉంచేందుకు అక్కడికి వెళ్ళాను.

ఇంగ్లండుకు తిరిగి వచ్చాక బోరిస్ సలింకోవ్ అనే అద్భుతమైన వ్యక్తిని కలిశాను. ఆయన టెర్రరిస్టు. ట్రెపోవ్, గ్రాండ్‌డ్యూక్ సెర్జిన్స్‌లను ఆయనే హత్యచేశాడు. నాకు టి.బి. ఎక్కువయింది. స్పెషలిస్టు సలహా మీద నార్త్‌స్కాట్లండులోని దావోస్‌కి వెళ్ళాను. రెండేళ్ళు పనికిరానివాడిగా జీవితాన్ని గడిపాను. రోగిగా హాస్పిటల్ బెడ్ మీద వుండడం - ఆ ఏకాంతం, ప్రైవసి, స్వేచ్ఛ, వంటరితనం, సెక్యూరిటీ - నాకొకరకమైన సంతోషాన్నిచ్చాయి. ఆ శానిటోరియంలో మానవ స్వభావాన్ని గురించి చాలా తెలుసుకున్నాను.

ఆరోగ్యకుదుట పడేసరికి యుద్ధం అంతమైంది. చైనాలోను, అనేక దేశాల్లోను పర్యటించాను. పర్యటన నాజీవితానికి అనువైనది. మనుషులు, వారిలోని వైచిత్ర, ప్రకృతి అందాలతో నోట్ పుస్తకాల్ని

నింపేశాను. ప్రతి మనిషీ ప్రత్యేకమైన వాడే కావొచ్చు, కాని మనుషుల్ని సులభంగా 'టైప్స్'గా విభజించ వచ్చు. ప్రతి ప్రయాణమూ నన్ను ఎంతో కొంత మార్చింది. ఎన్నో రకాల మనుషుల్ని చూసి చూసి, షుమారు ఏడు పర్యటనల తరువాత నాకు అన్ని రకాల మనుషుల్లోనూ ఏదో ఒక సామ్యత కనిపిస్తూనే వుంది. దాంతో మనుషులను పరిశీలించడంతో విసిగి పోయాను. కాని, పర్యటన నాకు ఆనందాన్నిచ్చింది.

మెల్లగా కథలు వ్రాయడం ప్రారంభించాను. నన్ను హాస్యపూరితమైన కథలు వ్రాయమని కోరేవారు. కాని, అలా వ్రాయడం నా పద్ధతికాదు. నా మొదటి కథ ''రెయిన్''. దీన్ని పబ్లిషర్లు ఒకరి తరువాత ఒకరు నిరాకరించారు. నేను ఆరు కథలతో ఒక కథా సంకలనాన్ని ప్రచురించాను. అది విజయవంత మయింది. ఆ రోజుల్లో బ్రిటీషు, అమెరికన్ కథా రచయితలు చెఖోవ్ ప్రభావంతో వ్రాస్తుండేవాళ్ళు. చెఖోవ్‌ను అనుకరించడం తేలిక. అతని కథల్లో నాటకీయత తక్కువ. అతడు జీవితాన్ని చూసిన విధానంలో 'మొనాటనీ' వుంది. అతని పాత్రలకు ప్రత్యేక వ్యక్తిత్వాలుండవు. మపాసా ప్రభావం నా తొలిరోజుల కథమీద వుంది. నా పాత్రలన్నీ నిజ జీవితంలోవి. వాటిని సాహిత్యీకరించుకోవడంలోనే రచయిత ప్రతిభ యిమిడి వుంది. మహా రచయితలందరూ చేసిందదే. మానవ అహంత ప్రపంచమంత పెద్దది. ఎవరికి వారు ఎదుటి వాళ్ళలోని లోపాల్నే చూస్తారు. తమలోనూ లోపాలున్నాయని అనుకోరు.

నా సాహిత్యాన్ని గురించి నాకేమీ అతిశయోక్తుల్లేవు. నా సాహిత్యాన్నెవరూ పట్టించుకోకపోయినా నాకేమీ బాధలేదు. విమర్శకులు ఎక్కువగా 'టెక్నిక్'ని పట్టించుకుంటారు. అలాంటి వాళ్ళకు 'విషయం' పట్టదు. కొందరు నా రచనల్ని 'బ్రూటల్' అనీ, మరికొందరు 'సినికల్' అనీ అన్నారు. ఇంకా కొందరు 'సూపర్‌ఫిషియల్' అన్నారు. ఎవరేమన్నా నా మార్గాన నేను పయనించాను. రచయితలు పొగడ్తల్నేకాదు, విమర్శల్నీ పట్టించుకోవాలి. సమకాలీనులెప్పుడూ రచయితల్ని అపార్థం చేసుకోవడం కద్దు. ఆంగ్లేయులెప్పుడూ కళాత్మక రచనలకంటె విషయాత్మక రచనల్నె ఇష్టపడతారు. అందుచేతనే ఆంగ్ల విమర్శకుల విమర్శలు రచయితలకుపయోగపడవు. విమర్శ వ్యక్తిగతం అందులో సృజనాత్మకత వుండదు. దాని బాధ్యత మార్గాన్ని చూపడమే. విమర్శకుడు మానసిక శాస్త్రవేత్త సాంఘిక శాస్త్రవేత్త అయివుండాలి.

రచయిత ఒకే మనిషికాడు; అనేక మంది మనుషుల సంకలనం. అందుచేతనే అతడు అనేక పాత్రల్ని సృజిస్తాడు. వాళ్ళతో కలిసి అనుభూతుల్ని పంచుకోడు, వాళ్ళ లోపలి ప్రపంచాన్ని తాను అనుభవిస్తాడు. స్వభావతః కళాకారుడు 'సోలిప్సిస్ట్'. అతడు పరిశీలకుడే కాదు, కార్యకర్తకూడా. ఒక్కోసారి అతడు హృదయం లేని వాడుగా అనిపిస్తాడు. అందుకే స్త్రీలు అతని విషయంలో చాలా జాగ్రత్తగా వుంటారు. అతని చేత ఆకర్షితులైనప్పటికీ తాము అతని మీద పెత్తనం చేయలేమని గ్రహిస్తారు. సహజంగా స్త్రీలు పురుషుల మీద అధికారాన్ని చెలాయించడానికి ఇష్టపడతారు. కళాకారుడు ఎలాగోలాగ ఈ అధికారాన్నించి తప్పించుకుంటాడని వాళ్ళకి తెలుసు. ప్రేమికుడైన మహాకవి గెథె. తన ప్రియురాలి కౌగిలిలో ఉండి, తన ప్రియురాలి సౌందర్యాన్ని స్పృశిస్తూ కవిత్వం వ్రాశాడు. కళాకారుడు కలిసి జీవించలేడు. అతడు తన సృజనాత్మకతతో నిజంగా, సంపూర్ణంగా మమేకమౌతాడు. ఏది ఏమైనా అతడిమీద ఆధార పడకూడదు.

(తరువాయి వచ్చేసంచికలో...)



గ్రామీణ రైతాంగంపై దౌర్జన్యం

MISIMI / **మిసిమి** / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD-191/2003-05



రైతు భారతం